S TV SAMAYAM

epaper.samayamdaily.net APTEL/26/A3949

# సమయం

మన గొంతుకే.. మన పత్రిక — తెలుగు దినపత్రిక

సమయం

విలేకరులు కావలెను

తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ, విశేష ప్రజాదారణ పొందుతున్న 'సమయం న్యూస్' తెలుగు దినపత్రికలో పని చేయుటకు విలేకరులు కావలెను. ఆసక్తి, అనుభవం కలిగిన వారు సంప్రదించండి.

7036644111, 9490140565

సంపుటి: 1 | సంచిక: 73 | ఎడిటర్ : అలీ ముర్తుజా | గురువారం 17 సెప్టెంబర్ 2026 | ప్రచురణ : విజయవాడ | పేజీలు: 8 | వెల: రూ.5 |

## చిన్నశేష, హంస వాహనాలపై మలయప్ప

- బ్రహ్మోత్సవాల్లో కన్నుల పండువగా 2వ రోజు
- ఉదయం 5 తలల చిన్నశేష వాహనంపై దర్శనం
- రాత్రి వీణ ధరించి హంస వాహనంపై విహారం
- గోవింద నామస్మరణతో మార్మోగిన తిరుమల



వివరాలు 2లో..



# ప్రపంచస్థాయి ఆధ్యాత్మిక నమూనాగా తిరుమల

### పర్యావరణహితంగా సప్తగిరులు!

- వర్చువల్ రియాలిటీ ద్వారా శ్రీవారి దర్శనం
- 104 కోట్లతో మ్యూజియం ఆధునీకరణ
- రాష్ట్రంలో కొత్తగా 5,000 ఆలయాల నిర్మాణం
- ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

**తిరుమల (సమయం న్యూస్):** తిరుమలను పవిత్రమైన దివ్యక్షేత్రంగా, ఆధ్యాత్మికతకు ప్రపంచ స్థాయి నమూనాగా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. తిరుమల కొండల్లో 89.5 శాతం గ్రీన్ కవర్ ఉందని, పర్యావరణ పరిరక్షణతో పాటు ఆధునిక సాంకేతికతను సమన్వయం చేస్తామన్నారు. బుధవారం తిరుమలలో పలు అభివృద్ధి కార్యక్రమాలను సీఎం ప్రారంభించారు. వైకుంఠం క్యూ కాంప్లెక్స్ 1 వద్ద ఏర్పాటు చేసిన పిలిగ్రిమ్స్ ఎక్స్ పీరియన్స్ సెంటర్, 104 కోట్లతో ఆధునీకరించిన ఎస్వీ మ్యూజియం, విరాళంగా వచ్చిన 32 విద్యుత్ బస్సులను జెండా ఊపి ప్రారంభించారు. ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌లో శ్రీవారి నిత్య కైంకర్యాలు, పూజా కార్యక్రమాలను 6 డీవీఆర్ వర్చువల్ రియాలిటీ ద్వారా భక్తులు వీక్షించే అవకాశం

మిగతా 2 లో

## బ్యాంకుల తీరు మారాలి

- రుణాల మంజూరులో వెనకబాటుపై సీఎం చంద్రబాబు అసంతృప్తి 2
- 13 అంశాలకు గాను 9 అంశాలపై చర్చలు





## విమర్శలను ఎదుర్కోలేక సెన్సార్‌షిప్

- అంతర్జాతీయ స్థాయికి రెడ్‌బుక్ పాలన!
- ఏపీ పోలీసుల తీరుపై జగన్ ధ్వజం

3




## ఆ ఘనత జగన్‌దే!

- పేదల అసైన్డ్ భూములకు పూర్తి హక్కులు
- నిషేధిత జాబితా నుంచి 35.44 లక్షల ఎకరాల విముక్తి
- వైఎస్సార్సీపీ ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి

3



## పన్నుల వ్యవస్థ బలోపేతం!

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 2

# యూపీఐ లావాదేవీలు కస్టమర్లకు ఉచితమే..

- కొత్త ఎండీఆర్ విధానంపై ఫోన్‌పే సీఈఓ క్లారిటీ
- ఎండీఆర్ విధానం అవసరమని వెల్లడి

4






2

## చదువుల్లో వెనకబడితే ఊరుకోం!

- విద్యా ప్రమాణాలపై టీచర్లతో నారా లోకేష్ సమీక్ష
- సిఎస్ఆర్ నిధులతో 2 బడుల పునర్నిర్మాణం పూర్తి
- బడిలో ప్రవేశాలు పెంచేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచన



## జీరం ఘాటీ నరమేధం

4

- 10 మంది మావోయిస్టులకు మరణశిక్ష
- 2013 నాటి దాడి కేసులో జగదల్‌పూర్ ప్రత్యేక న్యాయస్థానం కీలక తీర్పు

## బంగాళాఖాతంలో కొత్త అల్పపీడనం

- 19వ తేదీ నాటికి ఆవర్తనం
- 3, 4 రోజుల్లో తీరానికి ముప్పు

3



## రాష్ట్రవ్యాప్తంగా వైద్య శిబిరాలు!

- మోదీ జన్మదినం సందర్భంగా సేవా సంకల్ప్ అభియాన్
- నేటి నుంచి అక్టోబరు 17 వరకు 1 నెల పాటు శిబిరాలు
- ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రజలకు వైద్య సేవలు
- అధికారులకు మంత్రి సత్యకుమార్ కీలక ఆదేశాలు



.. వివరాలు 2లో



# చిన్నశేష, హంస వాహనాలపై మలయప్ప!

**బ్రహ్మోత్సవాల్లో కన్నుల పండువగా 2వ రోజు**

**ఉదయం 5 తలల చిన్నశేష వాహనంపై దర్శనం**

**రాత్రి వీణ ధరించి హంస వాహనంపై విహారం**

**గోవింద నామస్మరణతో మార్మోగిన తిరుమల**

**తిరుమల (సమయం న్యూస్):** శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా 2వ రోజు శ్రీ మలయప్ప స్వామివారు ఉదయం చిన్నశేష వాహనం, రాత్రి హంస వాహనంపై తిరుమాడ వీధులలో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. బుధవారం ఉదయం స్వామివారు పాండురంగస్వామి అలంకారంలో 5 తలల చిన్న శేషవాహనంపై దర్శనమిచ్చారు. పురాణ ప్రాశస్త్యం ప్రకారం చిన్నశేషుడిని నాగలోకానికి రాజైన వాసుకిగా భావిస్తారు. భగవంతుడు శేషి కాగా, ప్రపంచం శేషభూతం. ఈ శేషిభావాన్ని శేషవాహనం సూచిస్తుంది. చిన్నశేష వాహనాన్ని దర్శిస్తే కుటుంబ శ్రేయస్సుతో పాటు కుండలినీయోగ సిద్ధిఫలం లభిస్తుందని ప్రశస్తి.

**హంస వాహనంపై జ్ఞానస్వరూపుడిగా..**

రాత్రి శ్రీ మలయప్పస్వామివారు సరస్వతి అమ్మవారి అలంకారంలో, వీణను ధరించి హంస వాహనంపై భక్తులకు దివ్య దర్శనమిచ్చారు. పాలు, నీళ్లను వేరుచేసే హంస స్వభావం వివేకానికి సంకేతం. భక్తుల్లోని అజ్ఞానాంధకారాన్ని తొలగించి, వివేకజ్ఞానాన్ని ప్రసాదించేందుకు హంస వాహనసేవ ప్రతీకగా నిలుస్తుంది. వాహనసేవల సందర్భంగా తిరుమాడ వీధులు భక్తజన సందోహంతో కిక్కిరిశాయి. వివిధ రాష్ట్రాలకు చెందిన కళాబృందాలు ప్రదర్శించిన సంప్రదాయ కళారూపాలు భక్తులను విశేషంగా అలరించాయి. ఈ వాహన సేవల్లో తిరుమల పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, సీవీఎస్వో మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రవ్యాప్తంగా వైద్య శిబిరాలు!

**మోదీ జన్మదినం సందర్భంగా సేవా సంకల్ప్ అభియాన్**

**నేటి నుంచి అక్టోబరు 17 వరకు 1 నెల పాటు శిబిరాలు**

**ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రజలకు వైద్య సేవలు**

**అధికారులకు మంత్రి సత్యకుమార్ కీలక ఆదేశాలు**

**అమరావతి (సమయం న్యూస్):** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని 'సేవా సంకల్ప్ అభియాన్'లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా గురువారం నుంచి అక్టోబరు 17 వరకు 1 నెల పాటు ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించనున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా ఈ సేవలు అందనున్నాయని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ బుధవారం 1 ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఈ వైద్య శిబిరాలను నిర్వహించనున్నారు. ఈ క్యాంపుల్లో ప్రజలకు అవసరమైన వైద్య పరీక్షలు, చికిత్స అందిస్తారు. వీటితో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ ఆరోగ్య పథకాలపై ప్రజలకు పూర్తి



అవగాహన కల్పిస్తారు. అర్హులందరికీ ప్రభుత్వ ఆరోగ్య పథకాల ప్రయోజనాలు అందేలా తగిన చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు. 'వికసిత్ భారత్-స్వర్ణాంధ్రప్రదేశ్- 2047' లక్ష్యాలకు అనుగుణంగా ఈ కార్యక్రమాలను చేపడుతున్నట్లు సత్యకుమార్ చెప్పారు. పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకు సేవా సంకల్ప అభియాన్ ద్వారా దక్షిణాదిన జరిగే కార్యకలాపాలను భాజపా తరఫున మంత్రి సత్యకుమార్ స్వయంగా పర్యవేక్షిస్తున్నారు.

# ప్రపంచస్థాయి ఆధ్యాత్మిక నమూనాగా తిరుమల

(మొదటిపేజీ తరువాయి..)

కల్పించారు. టీసీఎస్ ట్రస్ట్ 104 కోట్లతో ఎస్వీ మ్యూజియాన్ని అభివృద్ధి చేసింది. పానోరమిక్ స్క్రీన్‌పై ఏఐ వీడియో ద్వారా శ్రీవారి పరిణయ విశేషాలను ముఖ్యమంత్రి తిలకించారు. మ్యూజియంలో విలువైన చారిత్రక వస్తువులు, ఆభరణాల 3డీ నమూనాలను ఏర్పాటు చేశారు.

**ప్రతి భక్తుడికి 2 లక్షల బీమా..**

తిరుమలలో భక్తుల రాకపోకలకు వీలుగా రిలయన్స్ ఫౌండేషన్, భారత్ బయోటెక్ సంస్థలు అందించిన 32 ఎలక్ట్రిక్ బస్సులను సీఎం ప్రారంభించారు. తిరుమలకు వచ్చే ప్రతి భక్తుడికీ ఎల్‌ఐసీ సహకారంతో ఆధార్ ఆధారితంగా 2 లక్షల బీమా సదుపాయం కల్పించనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో శ్రీవాణి ట్రస్టు ద్వారా 5,000 దేవాలయాలను నిర్మిస్తామని స్పష్టం చేశారు. మారిషస్, న్యూజిలాండ్ వంటి దేశాల్లోనూ ఆలయాలు నిర్మించే ఆలోచన ఉందన్నారు. భవిష్యత్తులో 6 అంశాల్లో టీటీడీ కార్యకలాపాలను పునర్వ్యవస్థీకరిస్తామని వెల్లడించారు.





# భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా!

- బీపీసీఎల్ రిఫైనరీపై సీఎం చంద్రబాబు సమీక్ష
- 2040 నాటికి 1 ట్రిలియన్ డాలర్లకు పెట్రో రంగం
- అత్యాధునిక రిఫైనరీల రూపకల్పనకు సర్కారు సూచన
- ఏపీఐఐసీ ఆధ్వర్యంలో పక్కా ప్రణాళికలు

**అమరావతి (సమయం న్యూస్):** రామాయపట్నం పోర్టు సమీపంలో భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్) చేపట్టనున్న గ్రీన్ ఫీల్డ్ రిఫైనరీ కమ్ పెట్రోకెమికల్ ప్రాజెక్టు పనులు త్వరితగతిన ప్రారంభించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. రిఫైనరీ సమీపంలో సుమారు 1,500 ఎకరాల్లో పెట్రో కెమికల్ పార్కును కూడా ఏర్పాటు చేయాలని ఆయన ప్రతిపాదించారు. బీపీసీఎల్ సీఎండీ సంజయ్ ఖన్నా ముఖ్యమంత్రితో సమావేశమై ప్రాజెక్టు వివరాలను వివరించారు. ప్రకాశం, నెల్లూరు జిల్లాల మధ్య ఏర్పాటు కానున్న ఈ ప్రాజెక్టు వ్యయం దాదాపు రూ.1.45 లక్షల కోట్లకు చేరిందని తెలిపారు.

1 ఏడాదికి 9 మిలియన్ టన్నుల సామర్థ్యంతో రిఫైనరీని ఏర్పాటు చేస్తున్నట్లు సీఎండీ పేర్కొన్నారు. సెప్టెంబర్ ఆఖరుకు పర్యావరణ అనుమతులు వచ్చే అవకాశం ఉందన్నారు. అక్టోబర్ నెలలో తుది పెట్టుబడి వ్యయం ఖరారైన వెంటనే నిర్మాణ పనులు ప్రారంభిస్తామని స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టు ద్వారా యూరో 6 ప్రమాణాలతో సుమారు 5.4 మిలియన్ టన్నుల ఇంధనం, 3.2 మిలియన్ టన్నుల ఇతర పెట్రోకెమికల్ ఉత్పత్తులు వస్తాయని వివరించారు.

**అక్టోబర్ 2 వ వారంలోగా భూమి అప్పగింత..**

రిఫైనరీ నిర్మాణం కోసం అవసరమైన 6,000 ఎకరాల భూమిలో 75 శాతాన్ని ఇప్పటికే అప్పగించామని సీఎం తెలిపారు. మిగిలిన భూమిని అక్టోబర్ 2 వ వారంలోగా ఇస్తామన్నారు. ప్రాజెక్టు ప్రక్రియలను వేగవంతం చేసి పనులు ప్రారంభించాలని కోరారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ముడి చమురును కేవలం ఇంధనంగానే కాకుండా రసాయన ముడి పదార్థాల ఉత్పత్తికి వినియోగించేలా ఆధునిక రిఫైనరీల రూపకల్పన జరగాలని ముఖ్యమంత్రి సూచించారు. 2040 నాటికి దేశంలో కెమికల్ రంగం 1 ట్రిలియన్ డాలర్లకు చేరుతుందని సీఎండీ సంజయ్ ఖన్నా వివరించారు.

# బ్యాంకుల తీరు మారాలి!

**రుణాల మంజూరులో వెనకబాటుపై సీఎం చంద్రబాబు అసంతృప్తి**

**13 అంశాలకు గానూ 9 అంశాలపై చర్యలు**

**తదుపరి భేటీలో జిల్లాల వారీగా సమీక్ష**

**అమరావతి (సమయం న్యూస్):** రాష్ట్రంలోని అన్ని వర్గాలను బలోపేతం చేసేలా బ్యాంకులు రుణాలు ఇవ్వాలని, ప్రతి అర్హుడికి బ్యాంకింగ్ సేవలు చేరాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బ్యాంకర్లకు దిశానిర్దేశం చేశారు. సచివాలయంలో బుధవారం జరిగిన 236 వ ఎస్ఎల్ బీసీ సమావేశంలో ముఖ్యమంత్రి పలు కీలక సూచనలు చేశారు. కొన్ని బ్యాంకులు రుణాలు ఇచ్చే విషయంలో వెనకబడి ఉన్నాయని, లక్ష్యాలను చేరుకుంటేనే ఈ సమావేశాలకు అర్థం ఉంటుందని సీఎం స్పష్టం చేశారు. గత సమావేశంలో ప్రస్తావించిన 13 అంశాలకు గానూ 9 అంశాలపై చర్యలు తీసుకున్నామని బ్యాంకర్లు తెలపగా, మిగిలిన లక్ష్యాలను చేరుకోకపోవడం సరికాదన్నారు. ఎంఎస్ఎంఈలకు రుణాల మొత్తం పెరిగినా ఆశించిన స్థాయిలో మంజూరు జరగలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. పీఎం సూర్యఘర్ పథకంలో రాష్ట్రాన్ని దేశంలోనే ముందు స్థానంలో నిలపాలని భావిస్తున్నామని, బ్యాంకులు భారీగా రుణాలు ఇస్తేనే ఇది సాధ్యమవుతుందని సీఎం తెలిపారు. ఎల్ నినో పరిస్థితులు ఉన్నప్పటికీ రాష్ట్ర ఆర్థిక వృద్ధి 15 శాతం సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. కౌలు రైతులకు సైతం సమృద్ధిగా రుణాలు అందించేలా బ్యాంకులు ముందుకు రావాలని సూచించారు. టిడ్కో గృహాలకు రుణాలు ఇచ్చేందుకు కార్యాచరణను త్వరితగతిన అమలులోకి తీసుకురావాలని ఆదేశించారు. నాలా చట్టం రద్దు చేసినందున ఆ పేరుతో రుణాలు ఆపి ఎవరినీ ఇబ్బందులకు గురిచేయవద్దని స్పష్టం చేశారు. వచ్చే ఎస్ఎల్ బీసీ సమావేశం నుంచి బ్యాంకులు, జిల్లాలు, విభాగాల వారీగా సమీక్ష ఉంటుందని వెల్లడించారు.

**మహిళా సంఘాలే ఆదర్శం..**

రుణాల చెల్లింపుల్లో స్వయం సహాయక సంఘాల మహిళలు దేశంలోనే నంబర్ 1 స్థానంలో నిలిచి ఆదర్శంగా ఉన్నారని సీఎం ప్రశంసించారు. 99 శాతానికి పైగా మహిళలు రుణాలను సమయానికే చెల్లిస్తున్నారని, కేవలం 0.67 శాతం మంది మాత్రమే వెనకబడ్డారని తెలిపారు. వీరి నుంచి 100 శాతం రికవరీ సాధించేందుకు వన్ టైమ్ సెటిల్మెంట్ విధానం గురించి బ్యాంకులు ఆలోచించాలన్నారు. సైబర్ మోసాలపై బ్యాంకులు అప్రమత్తంగా ఉండాలని, డీజీపీ సైబర్ సెక్యూరిటీ సెల్ తో సమన్వయం చేసుకుంటూ రాష్ట్రవ్యాప్తంగా ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.

# కాశీకి సీఎం చంద్రబాబు!

**మోదీ 25 ఏళ్ల ప్రజా ప్రస్థానంపై వేడుకలు**

**నేడు వారణాసిలో సేవా సంకల్ప్ అభియాన్**

**కార్యక్రమంలో పాల్గొననున్న ఏపీ ముఖ్యమంత్రి**

**ఉదయం 11.15 గంటలకు కాశీ విశ్వనాథుడి దర్శనం**

**అమరావతి (సమయం న్యూస్):** ప్రధాని నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజాసేవా ప్రస్థానాన్ని పురస్కరించుకుని వారణాసిలో నిర్వహిస్తున్న 'సేవా సంకల్ప్ అభియాన్' లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొనున్నారు. ప్రధానిగా, ముఖ్యమంత్రిగా ప్రజా జీవితంలో నరేంద్ర మోదీ చేసిన సేవలకు గుర్తింపుగా దేశవ్యాప్తంగా 1 నెల పాటు వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా కాశీ నగరంలో వారణాసి నుంచి వాద్నగర్ వరకు సేవా యాత్రను చేపట్టారు. ప్రధాని మోదీ ప్రజా జీవితంతో ప్రత్యేక అనుబంధం ఉన్న వారణాసి, వాద్నగర్ ప్రాంతాలను అనుసంధానిస్తూ ఈ యాత్ర సాగనుంది. యువత, ప్రజా ప్రతినిధులు, సేవా సంస్థల ప్రతినిధుల భాగస్వామ్యంతో దీనిని చేపట్టారు. దేశ అభివృద్ధి ప్రయాణంలో ప్రజా భాగస్వామ్యం, సేవా భావం, సామాజిక బాధ్యత కీలకమనే సందేశాన్ని ఈ యాత్ర ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లనున్నారు. ప్రతి గ్రామం, ప్రతి కుటుంబం, యువత, మహిళలు అభివృద్ధి ప్రక్రియలో భాగస్వాములు కావాలనే స్ఫూర్తితో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి సీఎం చంద్రబాబు హాజరు కానున్నారు.

**సీఎం పర్యటన వివరాలు..**

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గురువారం ఉదయం 7.30 గంటలకు విజయవాడ నుంచి బయలుదేరి 9.35 గంటలకు వారణాసి చేరుకుంటారు. ఉదయం 11.15 గంటలకు కాశీ విశ్వనాథుడ్ని దర్శించుకోనున్నారు. ఆ తర్వాత రుద్రాక్ష్ అంతర్జాతీయ కన్వెన్షన్ సెంటర్‌కు చేరుకుని సేవా యాత్ర ఫ్లాగ్ ఆఫ్ కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 3.10 గంటలకు వారణాసి నుంచి బయలుదేరి సాయంత్రం 5.15 గంటలకు తిరిగి అమరావతి చేరుకుంటారు.

# చదువుల్లో వెనకబడితే ఊరుకోం!

- విద్యా ప్రమాణాలపై టీచర్లతో నారా లోకేష్ సమీక్ష
- సిఎస్ఆర్ నిధులతో 2 బడుల పునర్నిర్మాణం పూర్తి
- బడిలో ప్రవేశాలు పెంచేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచన



**నెల్లూరు (సమయం న్యూస్):** కార్పొరేట్ హంగులతో నెల్లూరులోని ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారుతున్నాయి. దాతల సిఎస్ఆర్ నిధులతో సకల సౌకర్యాలతో పునర్నిర్మించిన 2 పాఠశాలలను ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేష్ బుధవారం లాంఛనంగా ప్రారంభించారు. మూలాపేటలో దేవిరెడ్డి శారద ఛారిటబుల్ ట్రస్ట్ 13.41 కోట్లతో అభివృద్ధి చేసిన డీఎస్ఆర్ పాఠశాలను, స్టోన్ హౌస్ పేటలో వీపీఆర్ ఫౌండేషన్ 8.3 కోట్లతో తీర్చిదిద్దిన ఆర్ఎస్ఆర్ మున్సిపల్ హైస్కూల్‌ను ఆయన అట్టహాసంగా ప్రారంభించారు.

**ప్రైవేటుతో పోటీ పడాలి..**

పాఠశాలల ప్రారంభోత్సవం అనంతరం ఆయా స్కూళ్ల ప్రధానోపాధ్యాయులు, ఇతర అధికారులతో మంత్రి నారా లోకేష్ ప్రత్యేకంగా సమీక్షించారు. 2 బడుల్లో విద్యార్థుల హాజరు తక్కువగా ఉండటంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. దానికి



గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా లెర్నింగ్ అవుట్ కమ్స్ (విద్యా ప్రమాణాల) పై ఉపాధ్యాయులు మరింత శ్రద్ధ వహించాలని ఆదేశించారు. ఆర్ఎస్ఆర్ స్కూల్‌లో గతేడాది 10 వ తరగతిలో కేవలం 60.19 శాతం ఉత్తీర్ణత నమోదైందని, ఈ ఏడాది ఆ శాతం కచ్చితంగా పెరగాలని లక్ష్యం నిర్దేశించారు. డీఎస్ఆర్ స్కూల్‌లో అడ్మిషన్లు పెరగడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఆర్ఎస్ఆర్ స్కూల్‌లో తగ్గిన అడ్మిషన్ల సంఖ్యను పెంచేలా ప్రైవేటు బడులతో పోటీ పడాలని సూచించారు. మధ్యాహ్న భోజనం నాణ్యతపై 100 శాతం నివేదికలు అందించాలని స్పష్టం చేశారు. విద్యార్థులు బాగా చదువుకుని తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

**సకల వసతులతో 2 బడులు..**

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు కూడా కార్పొరేట్ స్థాయి వసతులు అందాలన్న లక్ష్యంతో నగరంలో మొత్తం 15 స్కూళ్లను అభివృద్ధి చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఇందులో భాగంగా డీఎస్ఆర్ స్కూల్‌లో 24 తరగతి గదులు, ఆర్ఎస్ఆర్ స్కూల్‌లో 43 గదులను అధునాతనంగా నిర్మించారు. 2 చోట్లా ఎల్ఈడీ స్క్రీన్లు, ఆధునిక బెంచీలు, రోబోటిక్స్, కంప్యూటర్ ల్యాబ్‌లు, డిజిటల్ తరగతులతో పాటు విశాలమైన క్రీడా మైదానాలు, సింథటిక్ కోర్టులను విద్యార్థులకు అందుబాటులోకి తెచ్చారు.

# విమర్శలను ఎదుర్కోలేక సెన్సార్‌షిప్

- అంతర్జాతీయ స్థాయికి రెడ్‌బుక్ పాలన!
- ప్రభుత్వాన్ని ప్రశ్నించే గొంతులను నొక్కే కుట్ర
- ఏపీ పోలీసుల తీరుపై జగన్ తీవ్రస్థాయిలో ధ్వజం



**అమరావతి (సమయం న్యూస్):** సోషల్ మీడియాలో ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న వైఎస్సార్సీపీ నేతల ఖాతాలను బ్లాక్ చేసేందుకు ఏపీ పోలీసులు విదేశీ దర్యాప్తు సంస్థ పేరును వాడుకోవడంపై మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఎక్స్ వేదికగా చంద్రబాబు ప్రభుత్వంపై ఆయన పలు విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో సాగుతున్న 'రెడ్ బుక్' పాలన ఇప్పుడు అంతర్జాతీయ స్థాయికి చేరిందని ఎద్దేవా చేశారు. ఇటీవల వైఎస్సార్సీపీ అధికార ప్రతినిధి యణమల నాగార్జున యాదవ్ పెట్టిన 1 పోస్టును ఎక్స్ ద్వారా ఏపీ పోలీసులు బ్లాక్ చేయించారు. ఆ ఖాతాలను బ్లాక్ చేయాలని కోరుతూ ఏపీ పోలీసులు ఎక్స్ సంస్థకు పంపిన మెయిల్స్‌లో తమను తాము అమెరికాకు చెందిన 'ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్' (ఎఫ్బీఐ) గా పేర్కొనడం విస్మయానికి గురిచేస్తోందని జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది రాష్ట్ర పరువును దెబ్బతీసేలా ఉందని విమర్శించారు. అధికారిక ఏపీ పోలీసు మెయిల్ నుంచే ఈ అభ్యర్థన వచ్చినట్లు ఎక్స్ సంస్థ కూడా ధ్రువీకరించిందని ఆయన గుర్తుచేశారు.

### గొంతు నొక్కేందుకే ఈ కుట్రలు..

కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ 6, సూపర్ 7 హామీల వైఫల్యాలు, ఇసుక దోపిడీ లాంటి అంశాలపై ప్రభుత్వాన్ని నిలదీస్తున్న వారి గొంతు నొక్కేందుకే ఈ కుట్రలు చేస్తున్నారని జగన్ ఆరోపించారు. విమర్శలకు భయపడి సెన్సార్‌షిప్ తీసుకురావడం కన్నా పారదర్శకమైన పాలనతో ప్రజలకు సమాధానం చెప్పాలని సూచించారు. కరువు పరిస్థితుల్లో రైతులను ఆదుకోవడం, నిరుద్యోగులకు ఉపాధి కల్పించడంపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని ఆయన హితవు పలికారు. చట్టాన్ని కాపాడాల్సిన పోలీసు వ్యవస్థను ఇలా కక్ష సాధింపులకు వాడుకోవడం ప్రజాస్వామ్యానికే ముప్పు అని ఆందోళన వ్యక్తం చేశారు.

# పన్నుల వ్యవస్థ బలోపేతం!

- కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వ్యాఖ్యలు
- సంస్కరణలు తీసుకురావాల్సిన అవసరం ఉందని వెల్లడి
- బెంగళూరులో 8 వ అంతర్జాతీయ సదస్సుకు హాజరు
- వ్యవస్థకు ఉపయోగపడేలా ప్రతిపాదనలు ఉండాలని సూచన



**న్యూఢిల్లీ (సమయం న్యూస్):** దేశ పన్నుల వ్యవస్థను మరింత బలోపేతం చేయడంతో పాటు సరికొత్త సంస్కరణలను తీసుకువచ్చే దిశగా అడుగులు వేయాల్సిన అవసరం ఉందని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. బెంగళూరులో జరిగిన ఇంటర్నేషనల్ ట్యాక్స్ రీసెర్చ్ ఫౌండేషన్ 8 వ అంతర్జాతీయ సదస్సులో ఆమె పాల్గొని ప్రసంగించారు. పన్ను నిబంధనల్లో మార్పుల కోసం వ్యక్తిగత ప్రయోజనాల ఆధారంగా కాకుండా, వ్యవస్థకు ఉపయోగపడే రీతిలో విశ్లేషణాత్మక ప్రతిపాదనలతో ముందుకు రావాలని మంత్రి సూచించారు. ప్రస్తుతం అమల్లో ఉన్న కొన్ని నిబంధనల వల్ల కొందరికి ప్రయోజనం కలుగుతోందని, అయినప్పటికీ ఆ నిబంధనలు పన్ను వ్యవస్థ సమర్థతను దెబ్బతీసేలా ఉంటే వాటిని కచ్చితంగా తొలగించాలని ఆమె అభిప్రాయపడ్డారు. దేశ ఆర్థిక వ్యవస్థకు దీర్ఘకాలికంగా ప్రయోజనం చేకూర్చే అంశాలపైన ప్రధానంగా దృష్టి సారించాలన్నారు.

అదనపు భారం పడితే ప్రత్యామ్నాయాలు సూచించాలి..

పన్ను నిబంధనల సవరణలపై ప్రతిపాదనలు చేసేటప్పుడు పూర్తి సమాచారంతో కూడిన నివేదికలను సమర్పించాలని నిర్మలా సీతారామన్ కోరారు. ఏదైనా నిబంధన వల్ల పన్ను చెల్లింపుదారులపై అదనపు భారం పడుతుంటే, దాని వల్ల ఎంతమంది ప్రభావితమవుతున్నారు, ఎంత సమయం వృథా అవుతుందనే వివరాలను కచ్చితమైన గణాంకాలతో నిరూపించాలని కోరారు. దానికి ప్రత్యామ్నాయ మార్గాలు సూచించడంతో పాటు ప్రభుత్వ ఆదాయంపై పడే ప్రభావాన్ని అంచనా వేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం పన్ను విధానాలను సరళీకరిస్తూనే దేశ ఆర్థిక వృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటోందని గుర్తుచేశారు. నిబంధనల మార్పు ఒక వర్గానికి మాత్రమే కాకుండా, మొత్తం ఆర్థిక రంగానికి మేలు చేసేలా ఉన్నప్పుడే నిజమైన సంస్కరణలు సాధ్యమవుతాయన్నారు. విధానపరమైన అడ్డంకులను తొలగించేందుకు తాము ఎప్పుడూ సిద్ధంగా ఉంటామని ఆమె స్పష్టం చేశారు.

# ఆ ఘనత జగన్‌దే!

**పేదల అసైన్డ్ భూములకు పూర్తి హక్కులు**

**నిషేధిత జాబితా నుంచి 35.44 లక్షల ఎకరాల విముక్తి**

**వైఎస్సార్సీపీ ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి**




**తాడేపల్లి (సమయం న్యూస్):** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజలను నిలువునా మోసం చేస్తోందని వైఎస్సార్సీపీ ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గత వైఎస్సార్సీపీ ప్రభుత్వ సంక్షేమ ఫలాల క్రెడిట్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్లజ్జగా చోరీ చేస్తున్నారని ఆరోపించారు. తాడేపల్లిలోని పార్టీ కార్యాలయంలో ఇవాళ ఆయన మీడియాతో మాట్లాడారు. గత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం రికార్డు స్థాయిలో 30 లక్షల మంది మహిళలకు ఇళ్ల పట్టాలు ఇచ్చి, 20 లక్షలకు పైగా గృహాలను నిర్మించిందని శ్రీకాంత్ రెడ్డి గుర్తు చేశారు. 20 ఏళ్లు దాటిన అసైన్డ్ భూములపై అసైనీలకే పూర్తి యాజమాన్య హక్కులు కల్పిస్తూ జీవో ఎంఎస్ 596 తీసుకొచ్చిందని పేర్కొన్నారు. దాదాపు 15.21 లక్షల మంది రైతులకు చెందిన 27.41 లక్షల ఎకరాలను ఫ్రీహోల్డ్ చేసిందని తెలిపారు. వివిధ నిషేధిత జాబితాల నుంచి 35.44 లక్షల ఎకరాలకు విముక్తి కల్పించిన ఘనత జగన్ ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. గిరిజనులకు డీకేటీ, ఆర్వోఎఫ్ఆర్ పట్టాల ద్వారా వేలాది ఎకరాలపై హక్కులు కల్పించామన్నారు. తన 2.5 ఏళ్ల పాలనలో పేదలకు 1 గజం నివాస స్థలం కూడా ఇవ్వని చంద్రబాబు.. ఎన్నికల ముందు అసైన్డ్ భూములపై విషప్రచారం చేసి ఆ జీవోలను దాచేశారని మండిపడ్డారు. ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తుండటంతో గత ప్రభుత్వం తెచ్చిన జీవోల తాళాలు తీసి, ఆ ప్రయోజనాలన్నీ తానే చేసినట్లు డబ్బా కొట్టుకుంటూ ప్రచారం చేసుకోవడం పచ్చి మోసమని శ్రీకాంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.

# బంగాళాఖాతంలో కొత్త అల్పపీడనం

**19 వ తేదీ నాటికి ఆవర్తనం.. 3, 4 రోజుల్లో తీరానికి ముప్పు**

**మత్స్యకారులకు అధికారుల హెచ్చరికలు**



**అమరావతి (సమయం న్యూస్):** బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడేందుకు అనుకూల పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఉత్తర అండమాన్ సముద్ర ప్రాంతంలో ఉన్న ఉపరితల ఆవర్తనం ప్రభావంతో 19 వ తేదీ సాయంత్రం నాటికి అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని ఏపీ విపత్తు నిర్వహణ సంస్థ వెల్లడించింది. రాబోయే 3 లేక 4 రోజుల్లో పశ్చిమ వాయువ్య దిశగా కదులుతూ దక్షిణ ఒడిశా, ఉత్తరాంధ్ర తీరాల వైపు పయనించే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. దీని ప్రభావంతో వచ్చే వారంలో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే ప్రమాదం ఉన్నందున మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని అధికారులు సూచించారు.

# నేడు నానికి వీడ్కోలు!

**అధికార లాంఛనాలతో అంత్యక్రియలకు ప్రభుత్వ ఉత్తర్వులు**



**అమరావతి (సమయం న్యూస్):** మాజీ ఉప ముఖ్యమంత్రి, టీడీపీ నేత ఆళ్ల నాని గుండెపోటుతో విశాఖలో మృతి చెందడంతో ఆయన అంత్యక్రియలను ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించాలని కూటమి సర్కారు నిర్ణయించింది. విదేశాల్లో ఉన్న ఆయన 2 గురు కుమారులు రాత్రికి స్వదేశానికి చేరుకోనుండటంతో, నేడు ఏలూరులో అంతిమ సంస్కారాలు నిర్వహించనున్నారు. ఏలూరు నియోజకవర్గం నుంచి 3 సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన ఆయన, వైఎస్సార్సీపీ హయాంలో మంత్రిగా పనిచేశారు. 2024 ఎన్నికల అనంతరం ఆయన తెలుగుదేశం పార్టీలో చేరారు.

# మోపిదేవి శ్రీనివాసరావు సస్పెన్షన్

**జగన్ సంచలన నిర్ణయం..5 నెలల క్రితమే పార్టీలో చేరిక**

**రేపల్లెలో గ్రూపు రాజకీయాలపై సీరియస్**



**అమరావతి (సమయం న్యూస్):** రేపల్లె నియోజకవర్గానికి చెందిన సీనియర్ నేత మోపిదేవి శ్రీనివాసరావును వైఎస్సార్సీపీ నుంచి సస్పెండ్ చేస్తూ అధినేత జగన్ మోహన్ రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. 5 నెలల క్రితం ఆయన కాంగ్రెస్ పార్టీని వీడి జగన్ సమక్షంలో వైఎస్సార్సీపీలో చేరారు. పార్టీలో చేరినప్పటి నుంచి స్థానికంగా సమాంతర గ్రూపు రాజకీయాన్ని నడుపుతున్నారనే ఆరోపణలు వచ్చాయి. రాబోయే ఎన్నికల్లో రేపల్లె ఎమ్మెల్యే టికెట్ తనకేనంటూ ఆయన చేసుకుంటున్న ప్రచారంపై క్యాడర్ ఫిర్యాదు చేయడంతో జగన్ ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి.

# డిశ్చార్జ్ పిటిషన్లు కొట్టివేత!

**వివేకా హత్య కేసులో సీబీఐ కోర్టు కీలక నిర్ణయం**

**నిందితులు ఏ1, ఏ3, ఏ6 దాఖలు చేసిన పిటిషన్లు**

**విచారణార్హత లేదని తేల్చి చెప్పిన న్యాయస్థానం**

**సాంకేతిక ఆధారాలు, సాక్ష్యాల పరిశీలన**

**అమరావతి (సమయం న్యూస్):** మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు విచారణలో నాంపల్లిలోని ప్రత్యేక సీబీఐ కోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. తమపై నమోదైన తీవ్ర అభియోగాల నుంచి విముక్తి కల్పించాలని కోరుతూ ప్రధాన నిందితులు దాఖలు చేసిన డిశ్చార్జ్ పిటిషన్లను న్యాయస్థానం నిర్ద్వంద్వంగా కొట్టివేసింది. ఈ కేసులో ఏ1 ఎర్ర గంగిరెడ్డి, ఏ3 ఉమాశంకర్ రెడ్డి, ఏ6 గజ్జల ఉదయ్ కుమార్ రెడ్డి దాఖలు చేసిన వేర్వేరు డిశ్చార్జ్ పిటిషన్లను సవివరంగా విచారించిన కోర్టు, వాటికి ఎలాంటి విచారణార్హత లేదని తేల్చిచెప్పింది. సీబీఐ దాఖలు చేసిన చార్జిషీట్లు, సాంకేతిక ఆధారాలు, సమర్పించిన సాక్ష్యాలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం.. నిందితులపై ఉన్న అభియోగాలు విచారణకు అర్హమేనని స్పష్టం చేసింది.

# చేపల వేటపై జాతీయ సదస్సు!

**నేడు గుజరాత్‌లోని గాంధీనగర్‌లో నిర్వహణ**

**పాల్గొననున్న కేంద్ర మంత్రి రాజీవ్, సీఎం భూపేంద్ర**

**లోతట్టు సముద్ర చేపల వేట ప్రోత్సాహమే లక్ష్యం**

**నౌకల ఆధునీకరణ, ఎగుమతులపై కీలక చర్చలు**

**న్యూఢిల్లీ (సమయం న్యూస్):** లోతట్టు సముద్ర చేపల వేటను ప్రోత్సహించేందుకు కేంద్ర మత్స్య శాఖ సెప్టెంబర్ 17న గుజరాత్‌లోని గాంధీనగర్‌లో జాతీయ సదస్సు నిర్వహించనుంది. కేంద్ర మంత్రి రాజీవ్ రంజన్ సింగ్, గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ తదితరులు ఈ సమావేశంలో పాల్గొంటారు. ఆధునిక చేపల వేట సాంకేతికత, నౌకల ఆధునీకరణ, మత్స్యకారుల నైపుణ్యాభివృద్ధి, ఆర్థిక సహాయం, ప్రాసెసింగ్, ఎగుమతి మార్కెట్లతో అనుసంధానంపై సదస్సులో చర్చిస్తారు. భారత్ 2025-26 ఆర్థిక సంవత్సరంలో సుమారు రూ.73,890 కోట్ల విలువైన సముద్ర ఉత్పత్తులను ఎగుమతి చేసింది. దేశ ప్రత్యేక ఆర్థిక మండలిలో (ఈఈజెడ్) చేపల వేట కోసం ఇప్పటివరకు 9,650 ఉచిత డిజిటల్ యాక్సెస్ పాస్‌లు జారీ చేసినట్లు కేంద్ర ప్రభుత్వం తెలిపింది.



# విద్యార్థులకు భారీ ఊరట

- విద్యుత్ శాఖలో కొలువులు!
- ఏపీసీపీడీసీఎల్‌లో 25 మందికి కారుణ్య నియామకాలు
- కూటమి ప్రభుత్వంలో ఇప్పటివరకు 389 మందికి పోస్టింగులు
- త్వరలో 629 ఏఈ పోస్టుల భర్తీ ఫలితాలు
- ఉద్యోగులకు 3 డీఏలు ఇచ్చిన సర్కారు



**విజయవాడ (సమయం న్యూస్):** రాష్ట్రంలో విద్యుత్ శాఖ ఉద్యోగుల సంక్షేమం, యువతకు ఉద్యోగ అవకాశాలు, విద్యుత్ రంగంలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. స్థానిక గుణదలలోని ఆంధ్రప్రదేశ్ మధ్య ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థలో (ఏపీసీపీడీసీఎల్) 25 మంది ఉద్యోగార్థులకు ఆయన కారుణ్య నియామక పత్రాలను అందజేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ట్రాన్స్ కో, జెన్కో, సీపీడీసీఎల్, ఈపీడీసీఎల్, ఎస్పీడీసీఎల్ సంస్థల్లో ఇప్పటివరకు మొత్తం 389 మందికి కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగాలు కల్పించినట్లు తెలిపారు.

### 629 ఏఈ పోస్టుల భర్తీ.. 3 డీఏలు..

మరణించిన విద్యుత్ శాఖ ఉద్యోగుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి స్పష్టం చేశారు. అర్హులైన మరో 35 నుంచి 45 మందికి కట్ ఆఫ్ తేదీని నిర్ణయించి ఉద్యోగాలు కల్పించేందుకు అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. విద్యుత్ శాఖలోని అన్ని విభాగాలను కలిపి 629 అసిస్టెంట్ ఇంజనీర్ పోస్టుల భర్తీకి పరీక్షలు నిర్వహించామని, త్వరలో పారదర్శకంగా నియామక ప్రక్రియ పూర్తి చేస్తామని వెల్లడించారు. ఉద్యోగుల సంక్షేమం కోసం ఇప్పటి వరకు 3 డీఏలు ఇచ్చామన్నారు. వారికి మెరుగైన శిక్షణ అందించేందుకు విశాఖపట్నంలో 30 కోట్ల వ్యయంతో ప్రత్యేక ట్రైనింగ్ సెంటర్‌ను నిర్మించామని తెలిపారు.

### 6 లక్షల ఇళ్లకు సోలార్ ప్యానెల్స్..

గ్రామీణ ప్రాంతాల్లో గ్రీన్ ఎనర్జీని ప్రోత్సహించేందుకు సోలార్, విండ్ ప్రాజెక్టులను ప్రోత్సహిస్తున్నామని మంత్రి తెలిపారు. 6 లక్షల మంది ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు సూర్య ఘర్ పథకం ద్వారా ఇళ్లపై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. విద్యుత్ మౌలిక వసతులను బలోపేతం చేసేందుకు ఆర్డీఎస్ఎస్ పథకం ద్వారా 10000 కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పి. పుల్లారెడ్డి, డైరెక్టర్ టెక్నికల్ ఆవుల మురళీకృష్ణ యాదవ్, డైరెక్టర్ ప్రాజెక్ట్స్ హెచ్ ఆర్ టీవీఎస్ఎన్ మూర్తి, డైరెక్టర్ ఫైనాన్స్ ఎస్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# బస్సుపై డ్రోన్ దాడి.. 5 గురు మృతి!

**ఉక్రెయిన్‌లోని డ్నిప్రోపెట్రోవ్స్క్ లో దారుణం**

**ప్రయాణికుల బస్సుపై రష్యా దాడులు**

**ఏడుగురికి తీవ్ర గాయాలు**

**దాడులను ఖండించిన జెలెన్ స్కీ**

**కీవ్ (సమయం న్యూస్):** ఉక్రెయిన్‌లోని డ్నిప్రోపెట్రోవ్స్క్ ప్రాంతంలో ప్రయాణికుల బస్సుపై రష్యా డ్రోన్ దాడి చేయడంతో 5 గురు మరణించగా, కనీసం ఏడుగురు గాయపడ్డారు. మరోవైపు మైకొలైవ్ ప్రాంతంలో ప్రయాణికుల రైలుపైనా రష్యా దాడి చేసింది. అందులోని 168 మంది ప్రయాణికులు, సిబ్బందిని ఉక్రెయిన్ అధికారులు సురక్షితంగా తరలించారు. పౌర రవాణా వ్యవస్థలపై రష్యా చేస్తున్న దాడులను ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీ తీవ్రంగా ఖండించారు.

## సంపాదకీయం



# యుద్ధాలకు ముగింపు పలకాలి

**ప్రపంచ దేశాలు చొరవ తీసుకోవాలి**

**రణభేరితో మానవాళికి అపార నష్టం**

**ఆయుధాలకే లక్షల కోట్లు.. సంక్షేమానికి కొరత**

**ఇరాన్ యుద్ధంతో అమెరికాపై భారీ ఆర్థిక భారం**

ప్రపంచవ్యాప్తంగా కొనసాగుతున్న యుద్ధాలు మానవాళిని మరోసారి భయాందోళనలకు గురిచేస్తున్నాయి. ప్రాణనష్టంతోపాటు ప్రపంచ ఆర్థిక వ్యవస్థపైనా వాటి ప్రభావం తీవ్రంగా పడుతోంది. చమురు, సహజవాయువు రవాణాలో అంతరాయాలు, సరఫరా వ్యవస్థల్లో సమస్యలు, పెరుగుతున్న రక్షణ వ్యయం చివరకు సామాన్యుడి జీవన వ్యయాన్నే పెంచుతున్నాయి. నిత్యావసరాల ధరల నుంచి ఇంధన ధరల వరకు యుద్ధ ప్రభావం ఏదో రూపంలో ప్రపంచ ప్రజలపై పడుతోంది. మొదటి, రెండో ప్రపంచ యుద్ధాలు మానవాళికి మిగిల్చిన విధ్వంసం చరిత్రలో చెరగని విషాదం. కోట్లాది మంది ప్రాణాలు కోల్పోగా దేశాల ఆర్థిక వ్యవస్థలు ఛిన్నాభిన్నమయ్యాయి. రెండో ప్రపంచ యుద్ధంలో అణ్వాయుధాల వినియోగం ప్రపంచానికి యుద్ధం ఎంతటి వినాశనాన్ని మిగులుస్తుందో ప్రత్యక్షంగా చూపించింది. ఆ తర్వాత లీగ్ ఆఫ్ నేషన్స్, ఐక్యరాజ్యసమితి, భద్రతా మండలి వంటి అంతర్జాతీయ వ్యవస్థలు ఏర్పడినా ఘర్షణలకు పూర్తిగా అడ్డుకట్ట పడలేదు. కొరియా, వియత్నాం యుద్ధాల నుంచి పాలస్తీనా-ఇజ్రాయెల్ ఘర్షణలు, ఉక్రెయిన్ యుద్ధం వరకు ప్రపంచం వరుస సంక్షోభాలను చూస్తూనే ఉంది. సామ్రాజ్యవాద ప్రయోజనాలు, ఆర్థిక ఆధిపత్య పోరు, మతపరమైన విద్వేషాలు, పరోక్ష యుద్ధాలు శాంతికి సవాళ్లుగా నిలుస్తున్నాయి. అణ్వాయుధాలు, ఖండాంతర క్షిపణులు, అత్యాధునిక యుద్ధ విమానాలు, అపారమైన ఆయుధ సంపత్తి దేశాలకు సైనిక బలం ఇవ్వవచ్చేమో కానీ శాశ్వత శాంతిని ఇవ్వలేవు. ఆయుధాల కోసం వెచ్చిస్తున్న సంపదలో కొంతైనా పేదరిక నిర్మూలన, ఆకలి నివారణ, వైద్యం, విద్య, ఉపాధి కోసం వినియోగిస్తే కోట్లాది మంది జీవితాలు మెరుగుపడతాయి. యెమెన్, సూడాన్, అఫ్ఘానిస్థాన్ వంటి సంక్షోభ ప్రాంతాల్లో ప్రజలు ఆకలి, నిరాశ్రయత్వం, అనారోగ్యం వంటి సమస్యలతో పోరాడుతున్నారు. యుద్ధాల్లో విజేతలెవరన్న చర్చకంటే.. వాటి మధ్య చిక్కుకుని జీవితం కోల్పోతున్న సామాన్యుల గురించి ప్రపంచం ఎక్కువగా ఆలోచించాల్సిన అవసరం ఉంది. కళింగ యుద్ధం తర్వాత జరిగిన విధ్వంసాన్ని చూసి అశోకుడు పశ్చాత్తాపంతో శాంతి, ప్రజా సంక్షేమం వైపు అడుగులు వేసిన చరిత్ర మన ముందుంది. నేటి ప్రపంచ నాయకత్వంలోనూ అలాంటి పరివర్తన అవసరం. 'వసుధైవ కుటుంబకం' అన్న భావన నినాదంగా మిగలకుండా ఆచరణలో కనిపించాలి. ప్రస్తుతం ఇరాన్‌తో కొనసాగుతున్న యుద్ధం అమెరికాపైనా భారీ ఆర్థిక భారాన్ని మోపుతోంది. అమెరికా నిష్పాక్షిక కాంగ్రెషనల్ బడ్జెట్ ఆఫీస్ తాజా అంచనా ప్రకారం ఫిబ్రవరి 28 నుంచి ఆగస్టు 1 వరకు అమెరికా రక్షణ శాఖకు యుద్ధం కారణంగా సుమారు 38 బిలియన్ డాలర్ల ప్రత్యక్ష వ్యయం జరిగింది. యుద్ధ తీవ్రతను బట్టి ప్రతి అదనపు నెలకు మరో 2 నుంచి 3 బిలియన్ డాలర్లు ఖర్చయ్యే అవకాశం ఉందని అంచనా వేసింది. ఈ వ్యయంలో అత్యధిక భాగం వినియోగించిన మందుగుండు సామగ్రిని తిరిగి భర్తీ చేయడం, నష్టపోయిన సైనిక సామగ్రి, అదనపు విమాన కార్యకలాపాలు, ఇంధనం తదితర అవసరాలకు సంబంధించినదే. ముఖ్యంగా క్షిపణులను అడ్డుకునే ఇంటర్‌సెప్టర్ల నిల్వలు గణనీయంగా తగ్గాయని, వాటిని పూర్తిస్థాయిలో తిరిగి భర్తీ చేసుకోవడానికి కనీసం ఐదేళ్లు పట్టవచ్చని కాంగ్రెషనల్ బడ్జెట్ ఆఫీస్ అంచనా వేసింది. జూన్‌లో ట్రంప్ ప్రభుత్వం 87.6 బిలియన్ డాలర్ల అదనపు నిధులను కోరగా, అందులో 67.1 బిలియన్ డాలర్లు రక్షణ శాఖ అవసరాలకు, 42.3 బిలియన్ డాలర్లు నేరుగా ఇరాన్ ఘర్షణకు సంబంధించినవిగా పేర్కొన్నట్లు నివేదికలు వెల్లడించాయి. అయితే ఈ అంచనాల్లో అనిశ్చితి కూడా ఉంది. అవసరమైన సమాచారాన్ని అమెరికా రక్షణ శాఖ అందించకపోవడంతో ప్రభుత్వ డేటాబేస్‌లు, బహిరంగంగా అందుబాటులో ఉన్న నివేదికల ఆధారంగానే కాంగ్రెషనల్ బడ్జెట్ ఆఫీస్ లెక్కలు రూపొందించింది. దెబ్బతిన్న అమెరికా సైనిక స్థావరాల పునర్నిర్మాణ వ్యయం కూడా 38 బిలియన్ డాలర్ల లెక్కలో పూర్తిగా చేరలేదు. ఇరాన్ ఘర్షణ ప్రభావం యుద్ధరంగానికే పరిమితం కావడం లేదు. హర్మూజ్ జలసంధి, ఎర్ర సముద్రం మార్గాల్లో చమురు, సహజవాయువు రవాణాకు ఏర్పడుతున్న అంతరాయాలు ప్రపంచ ఇంధన ధరలపై ఒత్తిడి పెంచుతున్నాయి. ఈ పరిణామాల కారణంగా 2027 తొలి త్రైమాసికంలో అమెరికా ద్రవ్యోల్బణం గత అంచనాతో పోలిస్తే సుమారు 0.5 శాతం పాయింట్లు అధికంగా ఉండవచ్చని కాంగ్రెషనల్ బడ్జెట్ ఆఫీస్ అంచనా వేసింది. ఇది ఒక్క అమెరికా సమస్యగా చూడలేం. ఇంధన ధరలు పెరిగితే రవాణా, ఉత్పత్తి, వ్యవసాయం, విమానయానం నుంచి నిత్యావసరాల వరకు అనేక రంగాలపై ప్రభావం పడుతుంది. చివరకు ఆ భారం సామాన్య వినియోగదారుడిపైనే పడే ప్రమాదం ఉంటుంది. యుద్ధాలకు ఎంత ఖర్చవుతుందన్న లెక్కలకంటే వాటి కారణంగా కోల్పోతున్న ప్రాణాలు, ఛిన్నాభిన్నమవుతున్న కుటుంబాలు, నిర్వాసితులవుతున్న ప్రజలే అత్యంత పెద్ద నష్టం. మానవాళిపై దయ, ప్రేమ, సహానుభూతి పెరిగినప్పుడే సుస్థిర శాంతికి మార్గం ఏర్పడుతుంది. శాంతి చర్చలు రాజకీయ ప్రయోజనాలకు పరిమితం కాకుండా మానవ సంక్షేమమే కేంద్రంగా సాగాలి. భారతదేశం తన అహింసా సంప్రదాయం, సాంస్కృతిక వారసత్వం, 'వసుధైవ కుటుంబకం' భావనలతో శాంతియుత పరిష్కారాలను ప్రోత్సహించగలదు. ప్రపంచ దేశాలు కూడా ఆధిపత్య పోరాటాలకంటే దౌత్యానికి ప్రాధాన్యం ఇచ్చి ఘర్షణల్లో ఉన్న దేశాలను చర్చల బాట పట్టించాలి. యుద్ధాలు మరింత విస్తరించి ప్రపంచాన్ని ఆర్థిక సంక్షోభంలోకి నెట్టకముందే అంతర్జాతీయ సమాజం సమష్టిగా చొరవ తీసుకోవాల్సిన అవసరం ఉంది. యుద్ధంలో గెలిచేది ఒక దేశం కావచ్చు.. కానీ ఓడిపోయేది మాత్రం మానవత్వమే.

# షహజాద్ భట్టి నెట్‌వర్క్‌పై ఉక్కుపాదం

- ఉగ్రసంస్థగా ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం
- పాకిస్థాన్ కేంద్రంగా పనిచేస్తున్న ఎస్‌బీఎన్



**న్యూఢిల్లీ,సెప్టెంబర్ 16:** పాకిస్థాన్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న షహజాద్ భట్టి నెట్‌వర్క్‌ను (ఎస్‌బీఎన్) కేంద్ర ప్రభుత్వం ఉగ్రవాద సంస్థగా ప్రకటించింది. చట్టవ్యతిరేక కార్యకలాపాల నివారణ చట్టం (ఉపా) సెక్షన్ 35 కింద కేంద్ర హోంశాఖ బుధవారం ఈ మేరకు నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నిర్ణయంతో షహజాద్ భట్టి నెట్‌వర్క్ సంస్థతో పాటు దాని సభ్యులపై ఉగ్రవాద నిధులు (టెర్రర్ ఫైనాన్సింగ్), కుట్ర వంటి తీవ్రమైన అభియోగాల కింద కేసులు నమోదు చేసేందుకు దర్యాప్తు సంస్థలకు మార్గం సుగమమైంది. ఉగ్రవాదాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని, అందులో భాగంగానే ఈ కఠిన చర్యలు తీసుకున్నామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. ఈ సంస్థ సరిహద్దుల గుండా ఆయుధాలు, పేలుడు పదార్థాలు, మాదకద్రవ్యాలను స్మగ్లింగ్ చేస్తూ, యువతను, చిన్నచిన్న నేరస్థులను ఉగ్రవాదం వైపు ప్రేరేపిస్తోందని ఆయన పేర్కొన్నారు. విద్వేషపూరిత డిజిటల్ కంటెంట్‌తో దేశ ప్రజాస్వామ్య వ్యవస్థకు, మత సామరస్యానికి ఈ సంస్థ విఘాతం కలిగిస్తోందని హోంశాఖ నోటిఫికేషన్‌లో వెల్లడించింది. పాకిస్థాన్ నిఘా సంస్థ ఐఎస్ఐ మద్దతుతో నడుస్తున్న సిండికేట్‌గా అధికారులు ఎస్‌బీఎన్‌ను అభివర్ణిస్తున్నారు. గ్రెనేడ్లు, ఐఈడీ దాడులు, లక్షిత హత్యలు, పోలీసు, రక్షణ, మతపరమైన ప్రదేశాలపై నిఘా వంటి అసాంఘిక కార్యకలాపాల్లో ఈ సంస్థకు ప్రమేయం ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. దీని అధినేత షహజాద్ భట్టి దుబాయ్, పాకిస్థాన్‌ల నుంచి తన కార్యకలాపాలను నిర్వహిస్తుంటాడు. 2025 మార్చిలో పంజాబ్‌లోని జలంధర్‌లో యూట్యూబర్ రోజర్ సంధు నివాసంపై జరిగిన గ్రెనేడ్ దాడి, 2024 నవంబర్‌లో నటుడు మిథున్ చక్రవర్తికి అందిన బెదిరింపుల వెనుక భట్టి హస్తం ఉన్నట్లు ఏజెన్సీలు అనుమానిస్తున్నాయి. ఈ ఏడాది స్వాతంత్ర్య దినోత్సవానికి కొన్ని వారాల ముందు భద్రతా ఏజెన్సీలు దేశవ్యాప్తంగా 14 రాష్ట్రాల్లో దాడులు నిర్వహించి ఎస్‌బీఎన్‌తో సంబంధం ఉన్న 253 మందిని అదుపులోకి తీసుకున్నాయి. వారి నుంచి భారీగా పేలుడు పదార్థాలు, తుపాకులు, పాకిస్థాన్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ గుర్తులు ఉన్న గ్రెనేడ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ అరెస్టులు, పలు కేసుల్లో వెల్లడైన ఆధారాల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఎస్‌బీఎన్‌ను ఉగ్రవాద సంస్థగా ప్రకటిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది.




# జీరం ఘాటీ నరమేధం

## 10 మంది మావోయిస్టులకు మరణశిక్ష

**2013 నాటి దాడి కేసులో జగదల్‌పూర్ ప్రత్యేక న్యాయస్థానం కీలక తీర్పు**

**బస్తర్, సెప్టెంబర్ 16 (సమయం న్యూస్):** ఛత్తీస్‌గఢ్‌లోని జీరం ఘాటీ వద్ద 2013లో కాంగ్రెస్ పరివర్తన్ యాత్ర కాన్వాయ్‌పై జరిగిన మావోయిస్టుల దాడి కేసులో కీలక తీర్పు వెలువడింది. ఈ కేసులో దోషులుగా తేలిన 10 మంది మావోయిస్టులకు జగదల్‌పూర్‌లోని ప్రత్యేక న్యాయస్థానం మరణశిక్ష విధించినట్లు సమాచారం. 2013లో జీరం ఘాటీ అటవీ ప్రాంతంలో కాంగ్రెస్ పరివర్తన్ యాత్ర కాన్వాయ్‌ను సుమారు 150 మందికి పైగా మావోయిస్టులు లక్ష్యంగా చేసుకుని ఆకస్మిక దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో కాంగ్రెస్ అగ్రనేతలతోపాటు మొత్తం 29 మంది ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో కేంద్ర మాజీ మంత్రి విద్యాచరణ్ శుక్లా, అప్పటి ఛత్తీస్‌గఢ్ పీసీసీ అధ్యక్షుడు నంద్‌కుమార్ పటేల్, ఆయన కుమారుడు దినేష్ పటేల్, 'సల్వా జుడుం' వ్యవస్థాపకుడు మహేంద్ర కర్మా తదితరులు ఉన్నారు. ఈ దాడి అప్పట్లో దేశవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించింది. హత్య, నేరపూరిత కుట్రకు సంబంధించిన నిబంధనలతోపాటు చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టంలోని నిబంధనల కింద దోషులకు న్యాయస్థానం శిక్ష విధించినట్లు సమాచారం. ఘటన జరిగిన 13 ఏళ్ల తర్వాత ఈ కేసులో తీర్పు వెలువడటం ప్రాధాన్యం సంతరించుకుంది.



# యూపీఐ లావాదేవీలు కస్టమర్లకు ఉచితమే..

**కొత్త ఎండీఆర్ విధానంపై ఫోన్‌పే సీఈఓ క్లారిటీ**




**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 16 (సమయం న్యూస్):** యూపీఐ వినియోగదారులకు ఎలాంటి ఛార్జీలు ఉండవని ఫోన్‌పే సీఈఓ సమీర్ నిగమ్ స్పష్టం చేశారు. యూపీఐ డిజిటల్ చెల్లింపుల వ్యవస్థను ఆర్థికంగా నిలకడగా కొనసాగించేందుకు కొత్త మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) విధానం అవసరమని చెప్పారు. ఈ విధానం వల్ల కస్టమర్లపై అదనపు భారం పడదన్నారు. ఐఏఎన్ఎస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో సమీర్ నిగమ్ ఈ వివరాలు వెల్లడించారు. వ్యక్తి నుంచి వ్యక్తికి చేసే చెల్లింపులతో పాటు వ్యక్తి నుంచి వ్యాపారికి చేసే చెల్లింపులు కూడా వినియోగదారులకు ఉచితంగానే ఉంటాయని చెప్పారు. ఎండీఆర్ చెల్లించే వ్యాపారులు ఆ మొత్తాన్ని కస్టమర్లపై వేయడానికి అనుమతి ఉండదన్నారు. వార్షిక టర్నోవర్ రూ.లక్ష కంటే తక్కువగా ఉన్న చిన్న వ్యాపారులు ఎండీఆర్ పరిధిలోకి రారని నిగమ్ తెలిపారు. పెద్ద దుకాణాల్లో జరిగే లావాదేవీల్లో 96 శాతం రూ.2 వేల కంటే తక్కువ మొత్తానివేనని చెప్పారు. వీటిపై ఎలాంటి ఛార్జీ ఉండదన్నారు. రూ.2 వేలకుపైగా జరిగే లావాదేవీలపై 0.4 శాతం ఎండీఆర్‌ను వ్యాపారులే చెల్లిస్తారని వివరించారు. ఈ ఎండీఆర్ ద్వారా వచ్చే ఆదాయాన్ని యూపీఐ వ్యవస్థలో పెట్టుబడులకు ఉపయోగించవచ్చని నిగమ్ తెలిపారు. యూపీఐ మౌలిక సదుపాయాలను కొనసాగించేందుకే పరిశ్రమకు ఏటా కనీసం రూ.10 వేల కోట్ల నుంచి రూ.12 వేల కోట్ల వరకు ఖర్చవుతోందన్నారు. కేవైసీ, సైబర్ భద్రత, మోసాల నివారణ, చార్జ్‌బ్యాక్‌లు, మూలధన వ్యయం వంటి వాటికీ భారీగా ఖర్చవుతుందని చెప్పారు. యూపీఐ కొత్త ఆదాయ విధానం వల్ల ఫిన్‌టెక్ సంస్థలు మార్కెటింగ్, ఆవిష్కరణలు, పరిశోధన, అభివృద్ధిపై మరింత పెట్టుబడి పెట్టే అవకాశం ఉంటుందని నిగమ్ పేర్కొన్నారు. 2020 నాటికి యూపీఐ వినియోగదారులు దాదాపు 20 కోట్ల మంది ఉండగా, ప్రస్తుతం ఆ సంఖ్య 50-55 కోట్లకు చేరిందని తెలిపారు.

# సౌదీకి హుతీల మరో భారీ షాక్!

**అమెరికా ఎఫ్-15 జెట్ కూల్చివేత..!**



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 16 (సమయం న్యూస్):** పశ్చిమాసియాలో సౌదీ అరేబియా-హుతీల పోరు మరింత తీవ్రమవుతోంది. యెమెన్‌లో ప్రభుత్వానికి సౌదీ అరేబియా మద్దతిస్తున్న నేపథ్యంలో.. అక్కడ రెబెల్స్ గా ఉన్న హుతీలు ఎదురుదాడులకు దిగుతున్నారు. ఇదే క్రమంలో ఎర్ర సముద్రంలోని బాబ్ ఎల్-మాండెబ్ ను కూడా స్వాధీనం చేసుకున్నట్లు తాజాగా ప్రకటించారు. తాజాగా మరో అడుగు ముందుకేసి సౌదీ అరేబియాలోని ముస్లింల పవిత్ర నగరం మక్కాపై డ్రోన్లు ప్రయోగించారు. అయితే వీటిని సౌదీ సమర్థంగా అడ్డుకుని మక్కాలో అలర్ట్ ప్రకటించింది. ఈ ఘటన చోటు చేసుకున్న కొద్ది గంటల్లోనే యెమెన్ గగనతలంపై ఎగురుతున్న సౌదీ ఎఫ్ 15 ఫైటర్ జెట్ ను కూల్చేసినట్లు హుతీలు ప్రకటించారు. మిత్రదేశం అమెరికా నుంచి తీసుకుని వాడుతున్న ఎఫ్15 ఫైటర్ జెట్ ను హుతీలు కూల్చేయడం తీవ్ర సంచలనం రేపుతోంది. నిన్న మొన్నటివరకూ హుతీల్ని యెమెన్ లో ఇరాన్ మద్దతు కలిగిన చిన్న రెబెల్ గ్రూప్ గా పరిగణించిన వారికి ఇప్పుడు వారి సత్తా తెలుస్తోంది. ఇరాన్ ఇచ్చిన క్షిపణులు, డ్రోన్లతో సౌదీ మీద హుతీలు చేస్తున్న యుద్ధం నిత్యం వార్తల్లో నిలుస్తోంది.యెమెన్‌లోని వివాదాస్పద మరిబ్ ప్రావిన్స్ గగనతలంలో సౌదీ అరేబియాకు చెందిన ఎఫ్-15 యుద్ధ విమానాన్ని విజయవంతంగా కూల్చివేసినట్లు హుతీ సైనిక దళాలు ప్రకటించాయి. తమ స్వదేశీ సాంకేతికతతో తయారు చేసిన ఉపరితలం నుండి గగనతలంలోకి దూసుకెళ్లే అత్యాధునిక క్షిపణి సహాయంతో ఈ విమానాన్ని నేలకూల్చినట్లు హుతీ ప్రతినిధి యాహ్యా సారీ తెలిపారు. అయితే హుతీల ఆరోపణలను సౌదీ అరేబియా ప్రభుత్వం ధృవీకరించలేదు. మక్కా నగరం తమకు అత్యంత పవిత్రమైనదని, దాని భద్రత విషయంలో ఎలాంటి రాజీపడే ప్రసక్తి లేదని సౌదీ సంకీర్ణ దళాలు హెచ్చరించాయి. కాగా తాము పవిత్ర ఇస్లామిక్ క్షేత్రాలకు ఎలాంటి హాని తలపెట్టలేదని హుతీ ప్రతినిధులు స్పష్టం చేశారు.

# పీఎఫ్ వేతన గరిష్ఠ పరిమితి 25,000

**కేంద్ర ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం**

**51 లక్షల మంది లబ్ధి పొందే చాన్స్**

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 16 (సమయం న్యూస్):** దేశంలో పనిచేస్తున్న కోట్లాది మంది వేతన జీవులకు కేంద్ర ప్రభుత్వం అద్భుతమైన వార్త అందించింది. ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ పరిధిలోకి వచ్చే సేవకుల వేతన పరిమితిని భారీగా పెంచుతూ కేంద్ర కేబినెట్ చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకు నెలకు రూ. 15,000 ఉన్న ఈ పీఎఫ్ వేతన గరిష్ఠ పరిమితిని ఏకంగా రూ. 25,000కు పెంచుతూ కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ ప్రతిపాదించిన బిల్లుకు ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర మంత్రిమండలి ఆమోదముద్ర వేసింది. ఈ సంచలన నిర్ణయాన్ని కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ మీడియా సమావేశంలో వివరంగా వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో దేశవ్యాప్తంగా సుమారు 51 లక్షల మంది ఉద్యోగులకు నేరుగా లబ్ధి చేకూరనుందని ఆయన తెలిపారు. ఈ సామాజిక భద్రతా పథకం విస్తరణ కోసం కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వం తరపున రూ. 11,339 కోట్ల నిధులను ఖర్చు చేయబోతోంది. ఈ నిర్ణయం సెప్టెంబర్ 17 నుంచే అమలులోకి రానుంది. గతంలో 2004 నుంచి 2014 వరకు పీఎఫ్ వేతన పరిమితి ఎలాంటి మార్పు లేకుండా కొనసాగింది. అనంతరం సెప్టెంబర్ 2014లో దీనిని రూ. 15,000కు పెంచారు. దాదాపు దశాబ్ద కాలం తర్వాత మళ్లీ ఇప్పుడు రూ. 25,000కు పెంచడం విశేషం. అనేక రాష్ట్రాల్లో కనీస వేతనాలు ఇప్పటికే రూ. 15,000 కంటే దాటిపోయిన నేపథ్యంలో 2014 పరిమితి కాలం చెల్లినదైందని, అందుకే సమగ్ర సంప్రదింపుల తర్వాత ఈ సీలింగ్‌ను రూ. 25 వేలకు పెంచినట్లు మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు. రూ. 15,000 కంటే ఎక్కువ జీతంతో కొత్తగా ఉద్యోగంలో చేరే చాలామందికి పీఎఫ్, పెన్షన్, సంబంధిత బీమా రక్షణ లభించేది కాదు. తాజాగా వేతన సీలింగ్‌ను రూ. 25,000కి పెంచడం వల్ల రూ. 15,000 నుంచి రూ. 25,000 మధ్య సంపాదించే మధ్యతరగతి ఉద్యోగులందరూ ఇకపై చట్టబద్ధంగా ఈపీఎఫ్ పరిధిలోకి వస్తారు. ఇది ఉద్యోగులకు రిటైర్మెంట్ బెనిఫిట్లను పెంచడమే కాకుండా, ప్రైవేటు సంస్థల యాజమాన్యాలకు తమ సిబ్బందికి మెరుగైన సామాజిక భద్రత కల్పించేందుకు ఉపయోగపడుతుంది.

# రైతులకే మా ప్రాధాన్యం!

**కస్తూరిరంగన్ నివేదిక అమలుపై కర్ణాటక వ్యతిరేకత**

**బెంగళూరు (సమయం న్యూస్):** పశ్చిమ కనుమల్లోని ప్రాంతాలను పర్యావరణ సున్నిత ప్రాంతాలుగా గుర్తించేందుకు రూపొందించిన కస్తూరిరంగన్ నివేదిక అమలును కర్ణాటక ప్రభుత్వం నిర్ద్వంద్వంగా వ్యతిరేకించింది. ఈ నివేదిక పరిధిలోకి రాష్ట్రంలోని 1,576 గ్రామాలు, సుమారు 20,668 చదరపు కిలోమీటర్ల ప్రాంతం వస్తుందని ప్రభుత్వం తెలిపింది. దీనివల్ల మలెనాడు ప్రాంత రైతులు, స్థానికుల జీవనోపాధిపై ప్రతికూల ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేసింది. బాధిత రైతులతో చర్చించి వారి అభిప్రాయాలను కేంద్రానికి తెలియజేస్తామని వెల్లడించింది.

# సీఎం పర్యటనపై రాజకీయ దుమారం!

**జోసెఫ్ విజయ్ లండన్ టూర్‌పై బీజేపీ ఫైర్**

**పెట్టుబడుల పేరిట విహారయాత్ర అంటూ విమర్శలు**



**చెన్నై (సమయం న్యూస్):** తమిళనాడుకు పెట్టుబడులను ఆకర్షించేందుకు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ చేపట్టిన లండన్ పర్యటన రాజకీయ వివాదానికి దారితీసింది. ఇప్పటికే రాష్ట్రంలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న సంస్థలనే కొత్త పెట్టుబడులుగా ప్రభుత్వం ప్రచారం చేస్తోందని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు నైనార్ నాగేంద్రన్ ఆరోపించారు. ఇది పెట్టుబడుల పర్యటన కాదని, విహారయాత్ర మాత్రమేనని ఆయన విమర్శించారు. మరోవైపు భద్రతా కారణాలతో సీఎం లండన్ కార్యక్రమం రద్దయింది.

# యూపీఐ చార్జీలపై దుమారం!

**2,000 పైబడిన లావాదేవీలపై 0.4 శాతం ఫీజు**

**కేంద్రం నిర్ణయాన్ని వ్యతిరేకించిన కాంగ్రెస్**

**న్యూఢిల్లీ (సమయం న్యూస్):** రూ. 2,000 కు పైబడిన కొన్ని వ్యాపార యూపీఐ లావాదేవీలపై 0.4 శాతం మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) విధించడాన్ని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకించింది. ఈ నిర్ణయం వ్యాపారులతో పాటు వినియోగదారులపై పరోక్షంగా భారం మోపుతుందని పేర్కొంటూ వెంటనే ఉపసంహరించుకోవాలని కేంద్రాన్ని డిమాండ్ చేసింది. పెట్రోల్, డీజిల్ కొనుగోళ్లలో రూ. 2,000 దాటడం సాధారణమని, పెట్రోల్ బంకులకు పూర్తి మినహాయింపు ఇవ్వకపోతే యూపీఐకి బదులు నగదు చెల్లింపులకే ప్రాధాన్యం ఇస్తామని పెట్రోలియం డీలర్లు హెచ్చరించారు.

# రాష్ట్రపతి వద్దకు యూసీసీ బిల్లులు!

**అసోం, గుజరాత్, మధ్యప్రదేశ్ అసెంబ్లీల ఆమోదం..**

**వ్యక్తిగత చట్టాల్లో ఏకరూపతే ప్రధాన లక్ష్యం..**

**గిరిజన తెగలకు ప్రత్యేక మినహాయింపులు**

**న్యూఢిల్లీ (సమయం న్యూస్):** అసోం, గుజరాత్, మధ్యప్రదేశ్ శాసనసభలు ఆమోదించిన ఉమ్మడి పౌరస్మృతి (యూసీసీ) బిల్లులు రాష్ట్రపతి ఆమోదం కోసం ఎదురుచూస్తున్నాయి. వివాహం, విడాకులు, వారసత్వం తదితర వ్యక్తిగత చట్టాల్లో దేశవ్యాప్త ఏకరూపత తీసుకురావడమే ఈ బిల్లుల ప్రధాన ఉద్దేశం. ఆయా రాష్ట్రాల్లోని గిరిజన సమాజాల సంప్రదాయాలు, ఆచారాలను పరిరక్షించేందుకు కొన్ని ప్రత్యేక మినహాయింపులు పొందుపరిచినట్లు అధికార వర్గాలు తెలిపాయి.

# బంగారు గని కూలి 67 మంది మృతి!

**సూడాన్‌లో ఘోర ప్రమాదం.. పశ్చిమ కోర్డోఫాన్‌లో కూలిన అల్ జారా గని**

**శిథిలాల కింద చిక్కుకున్న మరికొందరు.. తీవ్ర దిగ్భ్రాంతిలో ఆఫ్రికా దేశం**



**ఖార్టూమ్ (సమయం న్యూస్):** సూడాన్‌లోని పశ్చిమ కోర్డోఫాన్ ప్రాంతంలో అల్–జారా బంగారు గని కూలిపోవడంతో కనీసం 67 మంది మరణించారు. పలువురు కార్మికులు శిథిలాల కింద చిక్కుకున్నట్లు సమాచారం అందుతోంది. సహాయక బృందాలు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలను వేగవంతం చేశాయి. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.

# 25 మంది ఖైదీల విడుదల!

**రాజకీయ ఖైదీలను విడుదల చేసిన బెలారస్**

**2 సంస్థలపై ఆంక్షలు ఎత్తివేసిన అమెరికా**

**చర్చల అనంతరం కుదిరిన పరస్పర ఒప్పందం**

**త్వరలో మరికొందరు ఖైదీలు విడుదలయ్యే ఛాన్స్**

**మిన్స్క (సమయం న్యూస్):** అమెరికా ప్రభుత్వం 2 బెలారస్ సంస్థలపై ఆంక్షలను ఎత్తివేయడంతో బెలారస్ ప్రభుత్వం 25 మంది రాజకీయ ఖైదీలను విడుదల చేసింది. ఇరు దేశాల మధ్య జరిగిన విస్తృత చర్చల అనంతరం ఈ ఒప్పందం కుదిరింది. రాబోయే రోజుల్లో మరికొందరు రాజకీయ ఖైదీలు విడుదలయ్యే అవకాశం ఉందని అమెరికా ప్రతినిధులు వెల్లడించారు.

# మక్కాపై డ్రోన్ దాడి యత్నం!

- సౌదీ దళాల చేతిలో హౌతీ డ్రోన్ కూల్చివేత
- గగనతలంలోకి రాకముందే అడ్డుకున్న వైనం
- పవిత్ర నగరం భద్రత తమకు రెడ్ లైన్ అన్న సౌదీ
- దాడుల ఆరోపణలను ఖండించిన హౌతీలు



**మక్కా (సమయం న్యూస్):** ఇస్లాం పవిత్ర నగరమైన మక్కా వైపు దూసుకొచ్చిన డ్రోన్‌ను సౌదీ అరేబియా నేతృత్వంలోని సంకీర్ణ దళాలు అడ్డుకుని కూల్చివేశాయి. నగరానికి దక్షిణ ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకున్నట్లు సంకీర్ణ దళాల అధికార ప్రతినిధి తుర్కీ అల్ మాలికీ వెల్లడించారు. ఇరాన్ మద్దతున్న యెమెన్ హౌతీ తిరుగుబాటుదారులు ప్రయోగించిన ఈ డ్రోన్ మక్కా నిషేధిత గగనతలంలోకి ప్రవేశించకముందే గుర్తించి ధ్వంసం చేశామన్నారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగలేదని తెలిపారు. మక్కా నగరం, అక్కడి పవిత్ర ప్రార్థనా స్థలాలు, యాత్రికుల భద్రత తమకు అత్యంత ప్రాధాన్యమని సౌదీ ప్రభుత్వం స్పష్టం చేసింది. పవిత్ర నగరాన్ని లక్ష్యంగా చేసుకునే ఎలాంటి చర్యనైనా తీవ్రంగా పరిగణిస్తామని, మక్కా భద్రత తమకు రెడ్ లైన్ అని హెచ్చరించింది. ఇటువంటి దాడులకు పాల్పడేవారిపై కఠిన ప్రతీకార చర్యలు తప్పవని సంకీర్ణ దళాలు పేర్కొన్నాయి. అయితే మక్కా లేదా ఇతర మతపరమైన ప్రదేశాలను తాము లక్ష్యంగా చేసుకోలేదని హౌతీలు ప్రకటించారు. సౌదీ అరేబియాలోని కొన్ని సైనిక స్థావరాలపై మాత్రమే దాడులు చేపట్టినట్లు వారు పేర్కొన్నారు. యెమెన్‌లో హౌతీ స్థావరాలపై సౌదీ వైమానిక దాడులు కొనసాగుతున్న నేపథ్యంలో ఈ ఘటన చోటుచేసుకుంది. హౌతీలు ఇటీవల సౌదీ భూభాగంలోని పలు ప్రాంతాలపై డ్రోన్లు, క్షిపణులతో దాడులకు ప్రయత్నిస్తుండటంతో ప్రభుత్వం దేశవ్యాప్తంగా కీలక ప్రాంతాల్లో భద్రతను కట్టుదిట్టం చేసింది. గతంలో 2017 లో కూడా మక్కా వైపు బాలిస్టిక్ క్షిపణిని ప్రయోగించేందుకు హౌతీలు ప్రయత్నించారని సౌదీ ఆరోపించింది. తాజా ఘటనతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరింత పెరిగే అవకాశం ఉందని అంతర్జాతీయ పరిశీలకులు భావిస్తున్నారు.

# మరాఠా ఉద్యమం ఉధృతం!

**ఓబీసీ జాబితాలో చేర్చాలని పట్టు.. మనోజ్ జరాంగే పాటిల్ తీవ్ర ఆందోళన**

**జాల్నా నుంచి ముంబైకి పాదయాత్ర..అప్రమత్తమైన మహారాష్ట్ర సర్కారు**



**ముంబై (సమయం న్యూస్):** మహారాష్ట్రలో మరాఠా రిజర్వేషన్ ఉద్యమం మరోసారి ఉధృతమైంది. మరాఠా సామాజికవర్గాన్ని ఓబీసీ జాబితాలో చేర్చి, అర్హులైన వారికి కున్బీ కుల ధ్రువపత్రాలు జారీ చేయాలని ఉద్యమ నేత మనోజ్ జరాంగే పాటిల్ డిమాండ్ చేశారు. జాల్నా నుంచి ముంబై వరకు నిరసన ప్రదర్శనకు పిలుపునివ్వడంతో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. ఆరోగ్యం క్షీణించడంతో ముంబై యాత్రపై పునరాలోచించే అవకాశం ఉందని జరాంగే పేర్కొన్నారు.

# ఆదివాసీ స్కూల్ ఠీక్ కరో!

**ఆదివాసీ బడుల బాగుకు సరికొత్త ప్రచారం**

**2 రాష్ట్రాల్లో ప్రభుత్వ పాఠశాలలపై అధ్యయనం**

**ఉపాధ్యాయుల కొరతపై ఉద్యమకారుల ఆందోళన**

**ప్రభుత్వాలపై ఒత్తిడి తేవడమే లక్ష్యం**

**నాగ్‌పూర్ (సమయం న్యూస్):** మహారాష్ట్ర, రాజస్థాన్‌లలోని ఆదివాసీ ప్రాంతాల ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను వెలుగులోకి తెచ్చేందుకు 'ఆదివాసీ స్కూల్ ఠీక్ కరో' ప్రచారం ప్రారంభమైంది. ఉపాధ్యాయుల కొరత, శిథిలావస్థకు చేరిన భవనాలు, మౌలిక వసతుల లేమిపై అధ్యయనం చేసేందుకు ఉద్యమకారులు ఆదివాసీ ప్రాంతాల్లో పర్యటించనున్నారు. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు.

# కిషావు ప్రాజెక్టుపై ఒప్పందం!

**6 రాష్ట్రాల మధ్య కుదిరిన కీలక ఒప్పందం**

**15,000 కోట్లతో టాన్స్ నదిపై నిర్మాణం**

**న్యూఢిల్లీ (సమయం న్యూస్):** ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్ సరిహద్దులోని టాన్స్ నదిపై నిర్మించనున్న కిషావు బహుళ ప్రయోజన ప్రాజెక్టు అమలుకు 6 రాష్ట్రాలు పరస్పర ఒప్పందం కుదుర్చుకున్నాయి. రూ. 15,000 కోట్లతో చేపట్టనున్న ఈ ప్రాజెక్టులో ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్, రాజస్థాన్, ఢిల్లీ, హర్యానా భాగస్వాములుగా ఉన్నాయి. దీనివల్ల 97,000 హెక్టార్లకు సాగునీరు, తాగునీటితో పాటు 422 మెగావాట్ల జలవిద్యుత్ అందనుంది. ప్రాజెక్టు మొత్తం వ్యయంలో కేంద్ర ప్రభుత్వం 90 శాతం భరించనుంది.

# భారత్, పాక్ యుద్ధనౌకల ఢీ!

**ఉత్తర అరేబియా సముద్రంలో ఘటన**

**పాక్ నౌక పీఎన్ఎస్ హునైన్ స్వల్ప ధ్వంసం**

**భారత నౌకకు ఎలాంటి ముప్పు లేదు**



**న్యూఢిల్లీ (సమయం న్యూస్):** ఉత్తర అరేబియా సముద్రంలోని అంతర్జాతీయ జలాల్లో భారత నౌకాదళ యుద్ధనౌక, పాకిస్థాన్‌కు చెందిన పీఎన్ఎస్ హునైన్ ఢీకొన్నాయి. పాక్ నౌక అసురక్షితంగా విన్యాసాలు చేయడం వల్లే ఈ ఘటన జరిగిందని భారత నౌకాదళం తెలిపింది. భారత నౌక కార్యకలాపాలకు ఎలాంటి ఆటంకం కలగలేదని, పాక్ నౌక స్వల్పంగా దెబ్బతిన్నట్లు సమాచారం. ఈ ఘటనపై పాకిస్థాన్ దౌత్యవేత్తను పిలిపించిన భారత ప్రభుత్వం తీవ్ర స్థాయిలో నిరసన వ్యక్తం చేసింది.

# పల్లెల నిండా అభివృద్ధి పండుగ!

**పవన్ కళ్యాణ్ దార్శనికతతో మారుతున్న రూపురేఖలు**

**పల్లె పండుగ 2.0 ద్వారా విస్తృతంగా పనులు**

**అడవితల్లి బాట కింద 2,310 కిలోమీటర్ల రహదారులు**

**త్వరలో పల్లె పండుగ 3.0 కు కార్యాచరణ**



**అమరావతి (సమయం న్యూస్):** ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ నేతృత్వంలో ఆంధ్రప్రదేశ్ గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధి వేగంగా సాగుతోంది. రాష్ట్రవ్యాప్తంగా 13,326 గ్రామ పంచాయతీల్లో నిర్వహించిన గ్రామసభల తీర్మానాల ఆధారంగా పల్లె పండుగ, పల్లె పండుగ 2.0 ద్వారా ప్రభుత్వం విస్తృతంగా పనులు చేపట్టింది.

**వేగంగా రోడ్ల నిర్మాణం..**

2.5 ఏళ్ల వ్యవధిలో 9,600 కిలోమీటర్ల సీసీ రోడ్లు, 10,000 కిలోమీటర్ల బీటీ రోడ్ల నిర్మాణం చేపట్టారు. ఆలయాలు, పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పిస్తున్నారు. 100 కు పైగా పుణ్యక్షేత్రాల వద్ద 120 కోట్లతో 205 కిలోమీటర్ల మేర రోడ్లు నిర్మిస్తున్నారు. అడవితల్లి బాట కార్యక్రమంలో భాగంగా గిరిజన గ్రామాలను అనుసంధానిస్తూ 2,078 కోట్లతో 2,310 కిలోమీటర్ల రహదారుల అభివృద్ధి పనులు కొనసాగుతుండగా, వాటిలో 1,000 కిలోమీటర్లకు పైగా పూర్తయ్యాయి. ఉపాధి హామీ పథకం ద్వారా 1.15 లక్షల పంట కుంటలు, 2 లక్షల ఎకరాల్లో పండ్ల తోటలు, 38,000 మినీ గోకులాలు, 15,000 నీటి తొట్టెలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. గ్రామీణ పారిశుధ్యాన్ని మెరుగుపరిచేందుకు 54 కిలోమీటర్ల మేర మ్యాజిక్ డ్రెయిన్లు నిర్మించారు. పల్లె పండుగ 3.0 లో భాగంగా వీబీ జీ రాంజీ, సాస్కీ తదితర పథకాల నిధులతో గ్రామాల సర్వతోముఖాభివృద్ధికి కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్లు ప్రభుత్వం తెలిపింది.

# కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి!

**బాంబే హైకోర్టు సంచలన తీర్పు**



**ముంబై (సమయం న్యూస్):** 8 నుంచి 11 ఏళ్లుగా కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న 450 మందికి పైగా వైద్యులు, పారామెడికల్ సిబ్బందిని తక్షణమే క్రమబద్ధీకరించాలని బాంబే హైకోర్టు ఆదేశించింది. వసాయ్ విరార్ మున్సిపల్ కార్పొరేషన్‌లో సరైన అర్హతలతో పనిచేస్తున్న సిబ్బందికి మళ్లీ పరీక్ష నిర్వహించాలన్న నిర్ణయాన్ని కోర్టు రద్దు చేసింది. 2 వారాల్లో వారి సర్వీసులను క్రమబద్ధీకరించాలని ఆదేశిస్తూ, దీర్ఘకాలిక కాంట్రాక్టు నియామక విధానాన్ని ముగించాలని ప్రభుత్వానికి సూచించింది.


# ఇజ్రాయెల్‌కు భారీ ఆయుధ ప్యాకేజీ!

**2.8 బిలియన్ డాలర్ల ప్రతిపాదన సిద్ధం.. ట్రంప్ ప్రభుత్వం కీలక నిర్ణయం**

**కాంగ్రెస్ కమిటీలకు చేరిన దస్త్రాలు.. పశ్చిమాసియాలో మరింత వేడెక్కిన రాజకీయం**



**వాషింగ్టన్ (సమయం న్యూస్):** ఇజ్రాయెల్‌కు సుమారు 2.8 బిలియన్ డాలర్ల విలువైన ఆయుధ ప్యాకేజీని విక్రయించేందుకు ట్రంప్ ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసింది. ఈ ప్రతిపాదనను అమెరికా కాంగ్రెస్ సంబంధిత కమిటీలకు పంపినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. అయితే ఈ ఒప్పందంపై అధికారిక ప్రకటన ఇంకా వెలువడాల్సి ఉంది.



# హైదరాబాదు విలీనం అయిన విధంబు ఎట్టి దనిన

భారతదేశ చరిత్రలో సెప్టెంబర్ 17 1948 చిర స్మరణీయమైన దినం. భారత్ సేనాధిపతుల వ్యూహరచన చాతుర్యానికి, సేనల అసమాన పరాక్రమానికి ప్రతిష్ట చేకూర్చిన రోజు. కోటిన్నర ప్రజల చిర వాంఛ ఫలప్రద మైన రోజు. హైదరాబాద్ పై భారత ప్రభుత్వ పోలీసు చర్య విజయ వంతంగా ముగిసిన సంఘటనకు సాక్ష్యం అయిన రోజు. దక్షిణ ప్రాంత భారత సర్వ సేనాని లెఫ్టినెంట్ జనరల్ మహారాజా రాజేంద్ర సింహ్ జీ సాటిలేని మేటి వ్యూహ రచనకు నిలువు టద్దంగా నిలిచిన రోజు. సెప్టెంబర్ 13 వ తేదీ తెల్లవారు జామున మూడు గంటలకు భారత సేనలు సంస్థానం నలువైపుల నుండి "చలో సికింద్రాబాద్" అని ముందు అడుగు వేశాయి. సికింద్రాబాద్ చేరవలసిన ప్రధాన సేనా వాహిని మేజర్ జనరల్ జయంత్ నాథ్ చౌదరి నాయకత్వంలో షోలాపూర్ నుండి నేరుగా సికింద్రాబాదుకు బయల్దేరింది. ఈ సేనలో ఒక దళం నల్ దుర్గ్ నుండి ఉత్తరంగా జాల్నా మీదికి సాగింది. దక్షిణాన హోస్పేట వద్ద, మైసూర్ సేనకు సంబంధించిన బ్రిగేడియర్ బాల్, మధ్య ప్రాంతం డి ఐ జి పార్థసారథి అయ్యంగార్ నేతృత్వంలో మైసూర్ సేన, కొంత మద్రాస్ ప్రత్యేక పోలీసు దళం, మరికొంత మునీరాబాద్ వద్ద తుంగభద్ర పై గల వంతెనను స్వాధీన పరచుకొని ముందుకు సాగాయి. కొంచెం తూర్పుగా కర్నూల్ వద్ద మైసూర్ అశ్వికదళం జాతీయ పోలీసు బలగం తుంగభద్ర రైలు వంతెన స్వాధీన పరచుకొని గద్వాల్ దిశగా సాగాయి. విజయ వాడ వద్ద నుండి బ్రిగేడియర్ మదన్ సింగ్ ఆధ్వర్యంలో ఒక సేనా దళం ఉత్తర ప్రాంత డిఐజి సుబ్బరాయన్ ఆద్వర్యంలో కొంత పోలీసు బలగంతో బయలు దేరాయి. సేవాదళం రెండు భాగాలుగా విడివడి... ఒకటి రైలు మార్గం వెంట ఖమ్మం మీదుగా వరంగల్, రెండవది సూర్యాపేట మీదుగా సికింద్రాబాద్ లక్ష్యాలుగా పురోగమించాయి. ఉత్తరాన కొంత సేన, కొంత పోలీసు బలగం బాలార్ష ను ఆక్రమించాయి. ఆ సమీపంలో గోదావరి పై గల రైలు వంతెనకు ప్రమాదం లేకుండా చేశాయి. పడమరగా కానేర్గాం వద్ద నుండి కొంత పోలీసు బృందం, హింగోలి దిశగా బయలు దేరగా, వాయవ్యంగా తాల్వాద్ నుండి ఒక సైనిక దళం ఔరంగాబాద్ కు సాగింది. షోలాపూర్, విజయవాడ, తాల్వాద్ నుండి బయల్దేరిన ప్రధాన సేన దళాలు... ఎలాంటి ప్రతిఘటనలు కేంద్రీకృతం కాకుండా చేసేందుకు, స్వాధీనమైన ప్రాంతాల్లో ఎప్పటికప్పుడు, సంఘ విద్రోహ శక్తులను మట్టుపెట్టే కార్యక్రమంలో నిమగ్నమయ్యారు. హోస్పేట, కర్నూలు, విజయవాడ నుండి బయలు దేరిన బలగాలు మద్రాస్ ప్రాంత సేనాని మేజర్ జనరల్ రుద్ర పర్యవేక్షణ కింద పని చేశాయి. ఈ దండయాత్రలో సిక్కులు గూర్ఖాలు మద్రాసు బొంబాయి తదితర పోలీసులు పాల్గొన్నారు. సేనాధిపతులలో ఇరువురు ఆంగ్లో-ఇండియన్లు కూడా ఉన్నారు. 13వ తేదీ సూర్యోదయం వేళ భారత వైమానిక దళాలు విజయవాడ ప్రాంతం నుండి ఎయిర్ వైస్ మార్షల్ ముఖర్జీ నాయకత్వంలో, నిజాం సంస్థానం లోని వరంగల్ బీదర్, ఔరంగబాద్ విమానాశ్రయాలను ఆనవాళ్లు లేకుండా చేశాయి. వాస్తవానికి భారత సేనలు సంస్థానం లోకి తరలి వస్తున్న విషయం 13వ తేదీ ఉదయం 11గంటలకు కానీ బయటకు తెలియనే లేదు. ఢిల్లీలో ఈ విషయాన్ని భారత ప్రభుత్వం బహిర్గతం చేసింది. భారత సైన్యం మెరుపు వేగంతో అన్నివైపుల నుండి సికింద్రాబాద్ వైపు, హైదరాబాద్ వైపు బలగాలు అవిశ్రాంతంగా ముందుకు సాగాయి. 14న మధిర అలంపూరు; 15న వనపర్తి, దౌలతాబాద్, సూర్యాపేట, ఖమ్మం మెట్టు, హోమ్నాబాదు, ఔరంగాబాదు భారత సేనల వశమైనాయి. హోమ్నాబాదు పతనంతో, భారత సేనలు సికింద్రాబాదుకు 10 మైళ్ళ పరిధిలోకి వచ్చాయి. అలా ముందుకు వెళ్లి ఆ రాత్రికి జహీరాబాద్ చేరాయి. నిజాం నవాబుకు దిక్కు తోచని స్థితి ఎదురయింది. ఇలాంటి స్థితిలో జార్జి రాజుకు, ట్రూమన్ కు విజ్ఞప్తులు పంపు కున్నాడు. అయినా ఎవరు పట్టించుకున్న దాఖలాలు లేవు. 16వ తేదీన వరంగల్, బీదర్, జాల్నా, సిర్పూగు, నారేటుపల్లి, సదాశివపేట సేనల వశమయ్యాయి. ఆరోజున అటు సోలాపూర్ నుండి నేరుగా సికింద్రాబాద్ వెళ్తున్న దళము, ఇటు విజయవాడ నుండి సూర్యాపేట సికింద్రాబాద్ రహదారిపై వెళుతున్న దళము నువ్వా నేనా అంటూ పోటీపడి ముందుకు సాగాయి.

17వ తేదీన హింగోలి సేనల వశమైంది. ప్రధాన దళాలు రెండు హైదరాబాద్, సికింద్రాబాద్ నగరాల శివార్లకు చేరుకున్నాయి. దక్షిణ ప్రాంత సర్వ సేనాధిపతి రాజేంద్ర సింహ్ జీ నిజాంను ఉద్దేశించి... "ఇక లాభం లేదు. లొంగీ పోయి అనవసర అయాచిత ప్రాణ నష్టం లేకుండా చూసుకోండి" అంటూ హితవు పలికారు. ఇక గత్యంతరం లేదని గ్రహించిన 17వ తేదీ సాయంత్రమే దాసోహం అన్నాడు. హైదరాబాదును ప్రత్యేక దేశంగా ఉంచాలని, కనీసం పాకిస్తాన్‌లో నైనా విలీనం చేయాలని విశ్వ ప్రయత్నం చేసిన నిజాం పన్నాగాలను ఉక్కుమనిషి పటేల్ బద్దలు కొట్టాడు. నిజాం ఐక్యరాజ్య సమితికి భారతదేశంపై ఫిర్యాదు చేయడానికి దూతలను కూడా పంపాడు. భారత దేశంపై పోరాటానికి విదేశాల నుంచి ఆయుధ దిగుమతికి ప్రయత్నాలు చేశాడు. అయినా అతని ఆటలు, నిజాం ప్రధాని లాయక్‌అలీ నాటకాలు, పటేల్ ఎదుట పనిచేయ లేదు. పోలీసు చర్యలో భాగంగా నలువైపులా నుంచి వస్తున్న భారత బలగాలను చూసి నిజాం కింగ్‌కోఠి నుంచి బయటకు వచ్చి భారత ప్రతినిధి కె.ఎం.మున్షీని కలిశాడు. అప్పటికే సమాచార సాధనాలు తెగి పోవడంతో ఎటూ అర్థంకాక కాళ్ళ బేరానికి దిగాడు. లొంగు బాటుకు మించిన తరుణోపాయం లేదని మున్షీ చెప్పడంతో నిజాం ఒప్పుకోక తప్పలేదు. బొల్లారం వద్ద నిజాం నవాబు సర్దార్ పటేల్ ఎదుట తలవంచి లొంగి పోవడంతో 1948 సెప్టెంబరు 17న హైదరాబాదు రాజ్యం భారత యూనియన్‌లో విలీనమైంది.



రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# ఆమిర్ అలీ ఖాన్‌కు న్యాయం చేయాలి

## కాంగ్రెస్ అధికారంలోకి రావడంలో 'సియాసత్' పాత్ర కీలకం

- ఆమిర్ అలీ ఖాన్‌ను తిరిగి ఎమ్మెల్సీగా నామినేట్ చేయాలి
- ఆయనను తప్పించడంపై ముస్లింలలో అసంతృప్తి ఉంది
- సీఎం రేవంత్, కాంగ్రెస్ అధిష్ఠానం పునరాలోచించాలి
- మహమ్మద్ రజా అఫ్సాన్, మెకానికల్ ఇంజనీర్ (రియాద్, సౌదీ అరేబియా)

**తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంలో 'సియాసత్' దినపత్రిక మరియు దాని న్యూస్ ఎడిటర్ జనాబ్ ఆమిర్ అలీ ఖాన్ అత్యంత కీలకమైన పాత్ర పోషించారని రియాద్ (సౌదీ అరేబియా)కు చెందిన మెకానికల్ ఇంజనీర్ మహమ్మద్ రజా అఫ్సాన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దాదాపు పదేళ్లపాటు బీఆర్ఎస్‌కు మద్దతుగా ఉన్న ముస్లింలను చైతన్యపరిచి, జిల్లాల్లో సభలు, కార్నర్ మీటింగ్‌లు నిర్వహించి కాంగ్రెస్ వైపు మొగ్గు చూపేలా ఆమిర్ అలీ ఖాన్ కృషి చేశారని తెలిపారు.**



**హైదరాబాద్, సెప్టెంబర్ 16:** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడటంలో ప్రముఖ ఉర్దూ దినపత్రిక 'సియాసత్', ఆ పత్రిక న్యూస్ ఎడిటర్ ఆమిర్ అలీ ఖాన్ కీలక పాత్ర పోషించారని రియాద్‌లో మెకానికల్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న మహమ్మద్ రజా అఫ్సాన్ పేర్కొన్నారు. 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్‌కు మద్దతుగా ఆమిర్ అలీ ఖాన్ వివిధ ప్రాంతాల్లో సభలు, కార్నర్ మీటింగ్‌లు నిర్వహించి ముస్లింలలో రాజకీయ చైతన్యం కల్పించారని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణలో దాదాపు పదేళ్లపాటు ముస్లింలలో గణనీయమైన వర్గం బీఆర్ఎస్ వైపు ఉందని, ఆ సమయంలో ముస్లింల సమస్యలను 'సియాసత్' ద్వారా ప్రస్తావిస్తూ కాంగ్రెస్‌కు మద్దతివ్వాలని ఆమిర్ అలీ ఖాన్ పిలుపునిచ్చారని రజా అఫ్సాన్ పేర్కొన్నారు. ఆయన సభలు, ప్రకటనల ప్రభావంతో వివిధ జిల్లాల్లో ముస్లిం ఓటర్లలో కొంతమంది కాంగ్రెస్‌కు మద్దతుగా నిలిచారని ఆయన అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటులో 'సియాసత్' లేదా ఆమిర్ అలీ ఖాన్ ప్రభావం ఎంతన్నది రాజకీయ విశ్లేషణకు సంబంధించిన అంశం; దీనిపై రజా అఫ్సాన్ చేసిన వ్యాఖ్యలు ఆయన అభిప్రాయాలుగా చూడాలి.

### 'సియాసత్ కేవలం పత్రిక కాదు'

'సియాసత్'ను కేవలం వార్తాపత్రికగా చూడలేమని, తెలంగాణ ముస్లింల సమస్యలు, సంక్షేమ అంశాలను నిరంతరం ప్రస్తావిస్తూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించిందని రజా అఫ్సాన్ పేర్కొన్నారు. ముస్లింలకు సంబంధించిన సమస్యలను బహిరంగంగా ప్రస్తావించడంలో ఆ పత్రిక ముందుంటుందని చెప్పారు. 2023 ఎన్నికల సమయంలో కొన్ని ముస్లిం రాజకీయ పార్టీలు, సంస్థలు బీఆర్ఎస్‌కు అనుకూలంగా, కాంగ్రెస్, రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా వ్యవహరించినప్పటికీ ముస్లిం ఓటర్లలో ఒక వర్గం కాంగ్రెస్‌కు మద్దతిచ్చిందని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అప్పట్లో కాంగ్రెస్‌ను వ్యతిరేకించిన కొందరు ప్రభుత్వానికి దగ్గరయ్యారని ఆరోపించారు. ఆమిర్ అలీ ఖాన్ వ్యక్తిగత ప్రయోజనాల కోసం కాకుండా సమాజం పట్ల బాధ్యతతో కాంగ్రెస్‌కు మద్దతుగా పనిచేశారని రజా అఫ్సాన్ అన్నారు. ఈ విషయం ఢిల్లీలోని కాంగ్రెస్ నాయకులతోపాటు తెలంగాణ కాంగ్రెస్ నేతలకూ తెలుసని పేర్కొన్నారు.



### ఎమ్మెల్సీగా నామినేషన్.. ఆ తర్వాత న్యాయ వివాదం

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రొఫెసర్ ఎం.కోదండరాం, ఆమిర్ అలీ ఖాన్‌లను గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా నామినేట్ చేశారు. అనంతరం ఈ నియామకాలు న్యాయ వివాదంలో చిక్కుకున్నాయి. సుప్రీంకోర్టు 2025 ఆగస్టులో వారి కొనసాగింపును నిలిపివేసిన తర్వాత ప్రభుత్వం కొత్తగా కోదండరాం, మహమ్మద్ అజహరుద్దీన్ పేర్లను ప్రతిపాదించింది. 2026 ఏప్రిల్‌లో గవర్నర్ శివప్రతాప్ శుక్లా ఆ ఇద్దరి నామినేషన్లకు ఆమోదం తెలిపారు. ఈ నియామకాలు సంబంధిత అప్పీళ్ల తుది ఫలితానికి లోబడి ఉంటాయని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో ఆమిర్ అలీ ఖాన్‌కు మరోసారి అవకాశం కల్పించాలని రజా అఫ్సాన్ కోరారు. ఆయనకు మొదట ఎమ్మెల్సీ అవకాశం దక్కడంతో ముస్లింలలో సానుకూల స్పందన కనిపించిందని, సమాజానికి సరైన ప్రతినిధిత్వం లభించిందన్న భావన ఏర్పడిందని పేర్కొన్నారు.

### 'జిల్లాల్లో విస్తృతంగా పర్యటించారు'

ఎమ్మెల్సీగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆమిర్ అలీ ఖాన్ తెలంగాణలోని వివిధ జిల్లాల్లో పర్యటిస్తూ ముస్లింలలో రాజకీయ అవగాహన పెంచేందుకు ప్రయత్నించారని రజా అఫ్సాన్ తెలిపారు. వివిధ వర్గాల నుంచి ఆయనకు స్వాగతం లభించిందని, సభలు, కార్నర్ మీటింగ్‌ల ద్వారా కాంగ్రెస్‌కు అనుకూలంగా పనిచేశారని పేర్కొన్నారు. అయితే ఆమిర్ అలీ ఖాన్ ఎమ్మెల్సీగా కొనసాగడాన్ని ఇష్టపడని కొందరు రాజకీయ ప్రయోజనాలతో ఆయనకు వ్యతిరేకంగా పనిచేశారని రజా అఫ్సాన్ ఆరోపించారు. గతంలో 'సియాసత్' ద్వారా ప్రచారం పొందిన కొందరు కాంగ్రెస్ నేతలు కూడా ఆయనకు వ్యతిరేకంగా ముఖ్యమంత్రి, ఏఐసీసీ నేతల వద్ద వార్తా కథనాలు, పత్రిక కటింగులు చూపించి ఫిర్యాదులు చేశారని పేర్కొన్నారు. ఈ ఆరోపణలకు ఆయన స్వతంత్ర ఆధారాలను వెల్లడించలేదు.

### అజహరుద్దీన్‌కు అవకాశం


2025 ఆగస్టులో రాష్ట్ర ప్రభుత్వం గవర్నర్ కోటా ఎమ్మెల్సీ స్థానాలకు కోదండరాం, మహమ్మద్ అజహరుద్దీన్ పేర్లను ప్రతిపాదిస్తూ ఆమిర్ అలీ ఖాన్ స్థానంలో అజహరుద్దీన్‌ను ఎంపిక చేసింది. అనంతరం 2026 ఏప్రిల్‌లో గవర్నర్ ఆ ఇద్దరి నామినేషన్లకు ఆమోదం తెలిపారు. ఆమిర్ అలీ ఖాన్‌కు మరోసారి అవకాశం ఇవ్వకపోవడంపై ముస్లింలలో అసంతృప్తి ఉందని రజా అఫ్సాన్ పేర్కొన్నారు. 'సియాసత్'కు చెందిన జాహిద్ అలీ ఖాన్ కుటుంబంతో ఈ విధంగా వ్యవహరించాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. 2023 ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నాయకులు జాహిద్ అలీ ఖాన్‌ను కలిసి మద్దతు కోరారని ఆయన గుర్తుచేశారు. ఉలమా, న్యాయవాదులు, మేధావులు, ముస్లిం నాయకులతోపాటు హైదరాబాద్, ఇతర జిల్లాలు, విదేశాల్లో నివసిస్తున్న కొందరిలోనూ ఈ పరిణామంపై అసంతృప్తి ఉందని రజా అఫ్సాన్ పేర్కొన్నారు.

### న్యాయ వివాదం ఇంకా కొనసాగుతోంది

గవర్నర్ కోటా ఎమ్మెల్సీ నియామకాల వ్యవహారం సుదీర్ఘ న్యాయ వివాదానికి దారితీసింది. పూర్వ బీఆర్ఎస్ ప్రభుత్వం దాసోజు శ్రవణ్, కుర్రా సత్యనారాయణ పేర్లను సిఫారసు చేయడం, అప్పటి గవర్నర్ వాటిని తిరస్కరించడం, అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వం కోదండరాం, ఆమిర్ అలీ ఖాన్‌లను ప్రతిపాదించడం వంటి పరిణామాలపై న్యాయస్థానాల్లో విచారణ జరిగింది. తర్వాత కోదండరాం, అజహరుద్దీన్ నియామకాలూ తుది న్యాయ నిర్ణయానికి లోబడే ఉంటాయని పేర్కొన్నారు.

### 'ఆమిర్‌కు మరో అవకాశం ఇవ్వండి'

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, కాంగ్రెస్ రాష్ట్ర, జాతీయ నాయకత్వం ఈ అంశంపై పునరాలోచించాలని రజా అఫ్సాన్ కోరారు. భవిష్యత్తులో ఖాళీ అయ్యే ఎమ్మెల్సీ స్థానాల్లో ముస్లిం సామాజిక వర్గానికి ప్రాతినిధ్యం కల్పించాలని, అందులో ఆమిర్ అలీ ఖాన్ పేరును పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. ఆమిర్ అలీ ఖాన్‌ను యువ, చురుకైన జర్నలిస్టుగా పేర్కొంటూ ఆయనతో ఏర్పడిన రాజకీయ దూరాన్ని తగ్గించాలని కోరారు. 2023 ఎన్నికల్లో వరంగల్, నల్గొండ, కరీంనగర్, ఖమ్మంతోపాటు వివిధ జిల్లాల్లో ముస్లిం ఓటర్లలో ఒక వర్గం కాంగ్రెస్‌కు మద్దతిచ్చిందని ఆయన పేర్కొన్నారు. అయితే భవిష్యత్ ఎన్నికల్లో ఏ పార్టీకి ఎంత మద్దతు లభిస్తుందన్నది ఓటర్ల నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది. ఆమిర్ అలీ ఖాన్‌కు ఎమ్మెల్సీ అవకాశం కల్పించడం వల్ల కాంగ్రెస్‌కు ఎన్నికల్లో ప్రయోజనం కలుగుతుందన్న రజా అఫ్సాన్ వ్యాఖ్యలు ఆయన రాజకీయ అంచనా మాత్రమే. ప్రభుత్వం, కాంగ్రెస్ అధిష్ఠానం ఆమిర్ అలీ ఖాన్‌కు న్యాయం చేయాలని, ముస్లిం వర్గాల్లో ఉన్న అసంతృప్తిని పరిష్కరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.




# విరాట్ స్వరూపుడు విశ్వకర్మ

సకల ప్రాణికోటికి సృష్టికర్తగా, సకల కళలకు ఆదిదేవుడిగా, దేవతల శిల్పిగా విశ్వకర్మను హిందూ సంప్రదాయం ఆరాధిస్తుంది. సృష్టికి పూర్వమే స్వయంభువుగా వెలసిన పరమాత్మ స్వరూపంగా విశ్వకర్మను విశ్వసిస్తారు. ఐదు ముఖాలు, పది చేతులతో కూడిన విరాట్ స్వరూపుడిగా ఆయనను వర్ణిస్తారు. వేదాలు, పురాణాలు, ఇతిహాసాలు, ప్రాచీన సాహిత్యంలో విశ్వకర్మకు విశిష్ట స్థానం కనిపిస్తుంది. ఋగ్వేదం, కృష్ణ యజుర్వేదం, శుక్ల యజుర్వేదాల్లో విశ్వకర్మను సృష్టికర్తగా పేర్కొన్నట్లు సంప్రదాయ వ్యాఖ్యానాలు చెబుతున్నాయి. అథర్వణ వేదంలో ఆహార ప్రదాతగా, పురుష సూక్తంలో విరాట్ పురుషుడిగా కీర్తించినట్లు విశ్వకర్మ సంప్రదాయం వివరిస్తుంది. సహస్ర బాహువులు, సహస్ర నేత్రాలు, సహస్ర పాదాలు, సహస్ర ముఖాలతో విశ్వమంతా వ్యాపించిన దైవస్వరూపంగా ఆయనను భావిస్తారు.




ఈ సృష్టికి పూర్వమే స్వయంభువుగా ఆవిర్భవించిన పరమాత్మ, సకల ప్రాణికోటి సృష్టికర్త విశ్వకర్మ జయంతిని పురస్కరించుకుని ఆయన మహోన్నత ప్రాశస్త్యాన్ని భక్తులు, స్మరించుకుంటున్నారు. ఋగ్వేదం, యజుర్వేదాలలో సృష్టికర్తగా, అథర్వణ వేదంలో ఆహార ప్రదాతగా, పురుష సూక్తంలో విరాట్ పురుషుడిగా విశ్వకర్మ కీర్తించబడ్డారు. ఐదు ముఖాలు, పది చేతులతో అవతరించిన విశ్వకర్మ పంచ ముఖాల నుండి మను, మయ, త్వష్ట, శిల్పి, విశ్వజ్ఞ అనే పంచ బ్రహ్మలు ఉద్భవించారని, వారి ద్వారానే పంచ వృత్తులు, పౌరోహిత్యం మరియు శాస్త్రాలు నిర్దేశించబడ్డాయని వేదప్రమాణాలు స్పష్టం చేస్తున్నాయి. దేవతల భవన శిల్పిగా, స్థపతిగా, ఆయుధాలు, పుష్పక విమానం మరియు సకల సువర్ణాభరణాల రూపశిల్పిగా విశ్వకర్మను మహాభారతం వెయ్యి కళలకు అధినేతగా వర్ణించింది. యుగయుగాల్లో ఇంద్రలోకం, స్వర్ణలంక, ద్వారకా నగరం, హస్తినాపురం, ఇంద్రప్రస్థం వంటి అద్భుత నిర్మాణాలను చేపట్టిన దివ్య యాంత్రికుడు విశ్వకర్మ. నన్నయ, తిక్కన, పోతన, వేమన వంటి ప్రముఖ కవులు తమ రచనల్లో "విశ్వకర్మ లేని విశ్వంబు లేదు" అని కొనియాడారు. లోహ, దారు, స్వర్ణ, శిల్పాది పంచ వృత్తులతో పాటు పౌరోహిత్యం, జ్యోతిషం, వాస్తు, వైద్య రంగాల్లో విశ్వబ్రాహ్మణులు మానవ సమాజ వికాసానికి, నిర్మాణానికి నాటి నుండి నేటి వరకు మూలస్తంభాలుగా నిలుస్తున్నారని వేద పండితులు పేర్కొన్నారు.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# కొచ్చి వేదికగా అక్టోబర్‌లో మెగా ఆక్షన్ నిర్వహణ..

## డబ్ల్యూపీఎల్ 2027 తేదీలు ఖరారు




మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) ఐదో సీజన్ నిర్వహణకు సంబంధించి భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) బుధవారం కీలక ప్రకటన విడుదల చేసింది. డబ్ల్యూపీఎల్ 2027 ఎడిషన్ మ్యాచ్‌లను 2027 జనవరి 14 నుంచి ఫిబ్రవరి 7 వరకు నిర్వహించనున్నట్లు స్పష్టం చేసింది. ఈ కొత్త సీజన్ కోసం ఆటగాళ్ల మినీ వేలాన్ని ఈ ఏడాది అక్టోబర్ 28న కేరళలోని కొచ్చి నగరంలో జరుపుతారు. అయితే ఈ టోర్నీ మ్యాచ్‌లకు ఆతిథ్యమిచ్చే వేదికల వివరాలను మాత్రం బీసీసీఐ ప్రస్తుతానికి వెల్లడించలేదు. మహిళల క్రికెట్‌లో ప్రపంచంలోనే అతిపెద్ద టీ20 లీగ్‌గా అవతరించిన డబ్ల్యూపీఎల్, సరికొత్త ప్రతిభను వెలికితీయడంలో కీలక పాత్ర పోషిస్తోందని బోర్డు తన అధికారిక ప్రకటనలో తెలిపింది. ఇండియా అంతర్జాతీయ స్టార్లతో పాటు వం-ర్ధమాన క్రీడాకారిణులు తమ సత్తా చాటేందుకు ఈ లీగ్ గొప్ప వేదికగా నిలిచింది.రాబోయే సీజన్ కోసం ఐదు ఫ్రాంచైజీలు తమ జట్లను సిద్ధం చేసుకోవడంపై కసరత్తు చేస్తున్నాయి. ప్రస్తుతం ఉన్న జట్ల నుంచి ఆటగాళ్లను అట్టిపెట్టుకోవడానికి బీసీసీఐ సెప్టెంబర్ 28ని ఆఖరి గడువుగా నిర్ణయించింది. ఈ గడువు లోగా ఫ్రాంచైజీలు తాము రిటైన్ చేసుకునే ఆటగాళ్ల జాబితాను సమర్పించాల్సి ఉంటుందని తెలుస్తోంది. రాబోయే సీజన్‌కు సరిపడే అత్యుత్తమ కాంబినేషన్‌లను ఎంపిక చేసుకోవడానికి జట్లకు ఇది మంచి అవకాశం. 2026 ఎడిషన్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) సంచలన ఆటతీరుతో రెండోసారి డబ్ల్యూపీఎల్ ట్రోఫీని కైవసం చేసుకున్న సంగతి తెలిసిందే. స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన సారథ్యంలో బరిలోకి దిగిన ఆర్సీబీ, అద్భుత ప్రదర్శనతో టైటిల్ నిలబెట్టుకుంది. ఆ సీజన్ మ్యాచ్‌లను నవీ ముంబై, బరోడాలలో విజయవంతంగా నిర్వహించారు. ఇప్పుడు జరగబోయే ఐదో సీజన్‌లోనూ విజేతగా నిలిచి హ్యాట్రిక్ సాధించాలని ఆర్సీబీ బృందం కృతనిశ్చయంతో ఉంది. ఇందుకు తగిన కసరత్తు ముమ్మరం చేస్తోంది ఆ టీమ్ మేనేజ్మెంట్. 2023లో ఆరంభమైన డబ్ల్యూపీఎల్ టోర్నమెంట్‌లో ఇప్పటివరకు ముంబై ఇండియన్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్లు చెరో రెండుసార్లు ఛాంపియన్లుగా నిలిచాయి. కొచ్చిలో జరిగే వేలం తర్వాత ఐదు ఫ్రాంచైజీలు కొత్త వ్యూహాలతో బరిలోకి దిగనున్నాయని తెలుస్తోంది. ఇక మిగతా జట్లు కూడా విజేతగా నిలిచేందుకు వ్యూహాలు పన్నుతున్నాయి.




# ఆసియా గేమ్స్‌లో టీమ్ఇండియాకు విప్రజ్ నిగమ్ ఎంపిక

ఒక ఆటగాడి గాయం కారణంగా ఇంకో ఆటగాడికి జట్టులో చోటు దక్కడం ఏ ఆటలోనైనా మామూలుగా జరిగేదే. తాజాగా టీమ్ఇండియా జాతీయ జట్టులోనూ అదే జరిగింది. అయితే ఈసారి జట్టులో చోటు దక్కించుకోనున్న ప్లేయర్?కు మాత్రం ఇది అరంగేట్రం కానుండడం విశేషం. గతేడాది ఐపీఎల్?లో టోర్నమెంట్?లో రాణించిన 22ఏళ్ల దిల్లీ క్యాపిటల్స్ బౌలర్?కు ఆసియా గేమ్స్?లో ఆడే అవకాశం దక్కినట్లు తెలుస్తోంది. మరో మూడు రోజుల్లో ఆసియా గేమ్స్ ప్రారంభం కానున్న నేపథ్యంలో టీమ్ఇండియాకు రీసెంట్?గా ఎదురుదెబ్బ తగిలింది. దిల్లీ వేదికగా ఇటీవల అఫ్గానిస్థాన్?తో జరిగిన తొలి టీ20 మ్యాచ్?లో మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి 'సైడ్ స్ట్రెయిన్' (పక్కటెముకల వద్ద కండరాల గాయం)కు గురయ్యాడు. దీంతో అతడు ఈ సిరీస్?లో మిగిలిన మ్యాచ్?లకు దూరమయ్యాడు. అయితే ఈ సిరీస్?తోపాటు వరుణ్ ఆసియా గేమ్స్? నుంచి కూడా దూరమయ్యాడు. దీంతో సెలక్టర్లు అతడి రిప్లేస్?మెంట్?గా ఐపీఎల్ స్టార్, స్పిన్ ఆల్?రౌండర్ విప్రజ్ నిగమ్?ను ఎంపిక చేసినట్లు ప్రముఖ వార్తా సంస్థ పీటీఐ తమ రిపోర్ట్?లో పేర్కొంది. "గాయం కారణంగా వరుణ్ కొద్దిరోజులు అందుబాటులో ఉండడు. అతడు గాయం నుంచి కోలుకోవాల్సి ఉంది. దీంతో అతడు ఈ పోటీలకు దూరమయ్యాడు. అయితే అతడి రిప్లేస్?మెంట్ కోసం సెలక్టర్ల జాబితాలో విప్రాజ్ నిగమ్, కుల్దీప్ యాదవ్ ఇద్దరి పేర్లు ఉన్నాయి. అయితే లెగ్ స్పిన్నర్? కమ్ ఆల్?రౌండ్ విప్రజ్? నిగమ్? వైపే సెలక్టర్లు మొగ్గు చూపించారు. రాబోయే ఆసియా గేమ్స్?లో వరుణ్ స్థానాన్ని విప్రజ్ నిగమ్ భర్తీ చేయనున్నాడు" అని బీసీసీఐ వర్గాలు చెప్పినట్లు పీటీఐ పేర్కొంది. విప్రాజ్ నిగమ్ బౌలింగ్?తోపాటు బ్యాటింగ్?లోనూ మెరుపులు మెరిపించగలడు. 2025లో ఐపీఎల్‌లో ఎంట్రీ ఇచ్చిన అతడు ఆకట్టుకున్నాడు. ఈ టోర్నీలో తన బ్యాటింగ్ నైపుణ్యాన్ని కూడా ప్రదర్శించాడు. టీ20ల్లో స్ట్రైక్ రేట్ 176గా ఉండడం విశేషం. విప్రాజ్ బంతితో రాణించడమే కాకుండా, లోయార్డర్‌లో వేగంగా పరుగులు సాధించగల సామర్థ్యం అతడికి ఉంది. కాగా, అఫ్ఘానిస్థాన్‌తో జరుగుతున్న టీ20 సిరీస్‌లోని మొదటి మ్యాచ్‌లో 35 ఏళ్ల వరుణ్ చక్రవర్తి గాయపడ్డాడు. మ్యాచ్ తర్వాత అతను అసౌకర్యంగా ఉన్నట్లు తెలిపాడు. ఆ తర్వాత అతడికి ఎమ్?ఆర్?ఐ స్కాన్ చేయించగా, పక్కటెముకల్లో గాయం ఉన్నట్లు తేలింది. దీంతో అతడిని బీసీసీఐ 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'కు పంపించారు. అక్కడ కొన్ని రోజులు రిహబిలిటేషన్ చేయనున్నాడు. ఇటీవలే హ్యామ్‌స్ట్రింగ్ సమస్య నుంచి కోలుకుని జాతీయ జట్టులోకి తిరిగి వచ్చిన వరుణ్ మళ్లీ తొలి మ్యాచ్?లోనే గాయపడడం అతడికి పెద్ద ఎదురుదెబ్బగా మారింది. కాగా, కుల్దీప్?ను కాదని విప్రజ్??ను ఎంపిక చేయడంపై ఓ కారణం ఉంది. ఈనెలలో ఆఖరి వారంలో భారత్ జట్టు వెస్టిండీస్?తో వన్డే సిరీస్ ఆడాల్సి ఉంది. ఇందులో కుల్దీప్ బరిలో దిగనున్నాడు. అందుకే విప్రజ్?ను ఆసియా గేమ్స్?కు పంపించారు.జపాన్‌లోని ఐచి- నగోయాలో సెప్టెంబర్ 19 నుంచి ఆసియా క్రీడలు ప్రారంభం కానున్నాయి. పురుషుల క్రికెట్ పోటీలు సెప్టెంబర్ 24న మొదలవుతాయి. అయితే భారత జట్టు నేరుగా క్వార్టర్-ఫైనల్ దశ నుంచే తన పోరాటాన్ని ప్రారంభిస్తుంది.

# వైభవ్ తో పోటీ బయటి ప్రపంచానికి మాత్రమే

అఫ్ఘానిస్తాన్‌తో జరిగిన రెండో టీ20 పోరులో 160 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో టీమ్ ఇండియా ఏ దశలోనూ ఒత్తిడికి లోనుకాకుండా, ఆడుతూ పాడుతూ టార్గెట్ చేజ్ చేసింది. ఓపెనర్లు సంజూ శాంసన్, అభిషేక్ శర్మ తొలి వికెట్‌కు 88 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని జోడించారు. కేవలం 22 బంతుల్లోనే 57 పరుగులు సాధించి సంజూ ఫామ్‌లోకి రావడంతో భారత్ 14.5 ఓవర్లలోనే విజయాన్ని అందుకుంది. ఈ మెరుపు ఇన్నింగ్స్‌తో 15 ఏళ్ల వండర్‌కిడ్ వైభవ్ సూర్యవంశీతో పోటీ గురించి వస్తున్న ఊహాగానాలకు సంజూ తనదైన శైలిలో స్పందించాడు. ఫామ్ అనేది తాత్కాలికం, క్లాస్ ఎప్పటికీ శాశ్వతం అని మరోసారి నిరూపించాడు. మ్యాచ్ అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో ఓపెనింగ్ స్థానం కోసం నెలకొన్న తీవ్ర పోటీపై అడిగిన ప్రశ్నకు సంజూ దీటుగా ఆన్సరిచ్చాడు. ఓపెనింగ్ బెర్త్‌ల వివాదంపై సంజూ శాంసన్ స్పందిస్తూ, "బయటి ప్రపంచానికి మాత్రమే వైభవ్ సూర్యవంశీ, అభిషేక్ శర్మ నాకు పోటీదారులుగా కనిపిస్తారు. కానీ డ్రెస్సింగ్ రూమ్‌లో మేమంతా ఒకే జట్టుగా దేశం కోసం ఆడుతున్నాం. మాకు జట్టు విజయం మాత్రమే ముఖ్యం, ఆ తర్వాతే వ్యక్తిగత ప్రదర్శనలు వస్తాయి. అతడికి అవకాశం ఇచ్చారు, నాకు ఎందుకు రాలేదు అని బాధపడుతూ నెగెటివ్ ఆలోచనలతో కూర్చోవడం మా జట్టు సంస్కృతిలో లేదు. అలాంటి మనస్తత్వాలు ఇక్కడ పనికిరావు" అని పేర్కొన్నాడు. సోషల్ మీడియాలో మాజీ క్రికెటర్లు చేసే వ్యాఖ్యల గురించి సంజూ శాంసన్ మాట్లాడుతూ, "సాధారణంగా నేను వైఫై ఆఫ్ చేసి నెగెటివిటీకి దూరంగా ఉంటాను. కానీ కొన్నిసార్లు ఆ కామెంట్లు నా కంట పడుతుంటాయి. ఇండియాలో ఆడుతున్నప్పుడు ఇలాంటి కామెంట్లు ఆటగాళ్లపై ప్రభావం చూపుతాయి. మేం రోబోలం కాదు, మాకు భావోద్వేగాలు ఉంటాయి. గతంలో విమర్శలు నన్ను కూడా బాధించాయి. అయితే అనుభవంతో వాటిని ఎలా ఎదుర్కోవాలో నేర్చుకున్నాను. ఒక షాట్ ఆడే ముందు బయట ఏమనుకుంటారో అని ఆలోచిస్తే నేను ఇలా బ్యాటింగ్ చేయలేను" అని తెలిపాడు. మొదటి రెండు మ్యాచ్‌ల్లో సంజూ, అభిషేక్‌లు రాణించినప్పటికీ, బెంచ్‌పై ఉన్న వైభవ్ సూర్యవంశీకి మూడో టీ20లో అవకాశం ఇస్తామంటూ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ సూచన ప్రాయంగా చెప్పాడు. దీంతో ఆఖరి పోరులో ఎవరికి విశ్రాంతి ఇస్తారనేది ఆసక్తిగా మారింది. ఇక ఈ ఈ సిరీస్ ను ఇప్పటికే 2-0తో ఇండియా కైవసం చేసుకోగా, స్వదేశంలో శ్రేయస్ కిదే తొలి సిరీస్ విక్టరీ కావడం విశేషం.






# భారత్‌లోనే జరగనున్న ఐపీఎల్ 2027 వేలం

గత కొన్ని ఏళ్లుగా విదేశాల్లో ఐపీఎల్ వేలాన్ని నిర్వహించే ట్రెండ్‌కు బీసీసీఐ బ్రేక్ వేసింది. మంగళవారం జరిగిన ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ కీలక సమావేశంలో 2027 ఐపీఎల్ మినీ వేలాన్ని మన భారతదేశంలోనే నిర్వహించాలని నిర్ణయించారు! 2023లో కొచ్చిలో జరిగిన వేలం తర్వాత దుబాయ్, జెడ్డా, అబుదాబి వంటి విదేశీ నగరాల్లో వేలాలు జరిగాయి. అయితే, 2028లో నిర్వహించే మెగా వేలాన్ని మళ్లీ విదేశాల్లో నిర్వహించే అవకాశం ఉన్నప్పటికీ, ఈసారి మినీ వేలాన్ని మాత్రం స్వదేశంలోనే నిర్వహించనున్నారు. మినీ వేలం కోసం తమ యాజమాన్యం, విశ్లేషకుల బృందాలను విదేశాలకు తీసుకెళ్లడం వల్ల తీవ్రమైన ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఫ్రాంచైజీలు బీసీసీఐకి విన్నవించాయి. గతేడాది అబుదాబి వేలం సందర్భంగానే టీమ్స్ ఈ అభ్యంతరాలను బీసీసీఐ దృష్టికి తీసుకెళ్లాయి. ఫ్రాంచైజీల అభిప్రాయాలకు గౌరవమిస్తూ, వేలాన్ని భారతదేశంలోని ఏదో ఒక నగరంలో నిర్వహించాలని ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ నిర్ణయించింది.అక్టోబర్ నుంచి డిసెంబర్ మధ్య కాలం భారతదేశంలో వివాహాల సీజన్ కావడంతో, వేలం వేదిక ఎంపిక కాస్త సవాలుగా మారింది. వేలం నిర్వహణతో పాటు 10 ఫ్రాంచైజీల బృందాలు, బీసీసీఐ అధికారుల వసతి కోసం కనీసం 100కి పైగా 5-స్టార్ హోటల్ గదులు రెండు రోజుల పాటు అవసరం అవుతాయి. హోటల్ గదుల లభ్యతను బట్టి ఏ భారతీయ నగరంలో వేలం నిర్వహించాలనేది త్వరలోనే అధికారికంగా ప్రకటించనున్నారు. మరోవైపు ఐపీఎల్‌లో ఎంతో వివాదాస్పదమైన 'ఇంపాక్ట్ ప్లేయర్' నియమంపై బీసీసీఐ ఇంకా ఏటూ తేల్చలేదు. ఈ రూల్‌ను కొనసాగించాలా వద్దా అనే దానిపై ఫ్రాంచైజీలలో విభిన్న అభిప్రాయాలు ఉన్నాయి. జట్టు నిర్మాణాన్ని ఈ నియమాన్ని బట్టే రూపొందించుకున్నామని, కాబట్టి దీనిపై హడావుడిగా కాకుండా వచ్చే ఏడాది నిర్ణయం తీసుకోవాలని కొన్ని జట్లు కోరుతున్నాయి. దీనిపై స్పష్టత కోసం మరో నెల రోజుల్లో ప్రత్యేకంగా గవర్నింగ్ కౌన్సిల్ సమావేశం కానుంది.




# ‘ది ప్యారడైజ్’కు సెన్సార్ పూర్తి..

నేచురల్ స్టార్ నాని అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ ‘ది ప్యారడైజ్’ సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకుంది. ఫిల్మ్ వర్గాల సమాచారం ప్రకారం, ఈ చిత్రానికి సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ ఏ సర్టిఫికేట్ జారీ చేసింది. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వం వహించిన ఈ సినిమా మొత్తం 2 గంటల 49 నిమిషాల నిడివితో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రం గురించి నాని మాట్లాడుతూ, తన 18 ఏళ్ల సినీ కెరీర్‌లో ఇంతగా శ్రమించిన సినిమా మరొకటి లేదని అన్నారు. “శారీరకంగా, మానసికంగా ‘ది ప్యారడైజ్’ నన్ను బాగా అలసిపోయేలా చేసింది. ఇంత కష్టపడి నేను మరో సినిమాకు పనిచేయలేదు” అని ఇటీవల మీడియా సమావేశంలో తెలిపారు. సోషల్ మీడియాలో వస్తున్న వదంతులపై కూడా ఆయన స్పష్టత ఇచ్చారు. “సినిమాలో నీటి అడుగున సన్నివేశాలు ఉన్నాయని, వెయ్యి మందితో ఫైట్ ఉంటుందని వార్తలు వస్తున్నాయి. వాటిలో నిజం లేదు. ఇది ఒక వాస్తవిక కథ. యాక్షన్ సన్నివేశాలు చాలా ఉన్నాయి. హింసలో కూడా ఓ భావోద్వేగం ప్రేక్షకులకు కనపడుతుంది” అని వివరించారు. దర్శకుడు శ్రీకాంత్ ఓదెల మాట్లాడుతూ, “సినిమా కాస్త ఆలస్యమైనా, విడుదలైన ప్రతి అప్‌డేట్‌కు అద్భుతమైన స్పందన వచ్చింది. ఇది ఒక విప్లవాత్మక, భావోద్వేగభరితమైన చిత్రం. తల్లీకొడుకుల కథతో పాటు, అణచివేతకు గురైన ఒక సమాజం కథ ఇది” అని అన్నారు. కాళోజీ మాటలను గుర్తుచేస్తూ, ““పుట్టుక మనది, చావు మనది, కానీ మన బతుకంతా దేశానిది’ అనే వాక్యం ఈ కథకు స్ఫూర్తి. దేశం కోసం పోరాడిన ప్రజలకు, అదే దేశంలో చోటు లేనప్పుడు ఏం చేయాలో తెలియక తిరగబడటమే ‘ది ప్యారడైజ్’ కథ” అని తెలిపారు. అభిమానుల్లో భారీ అంచనాలను రేకెత్తిస్తున్న ఈ చిత్రం సెప్టెంబర్ 24న విడుదల కానుంది.

# వేగం పెంచిన ‘ధర్మన్’




సూపర్ స్టార్ రజనీకాంత్ కథానాయకుడిగా నటిస్తున్న భారీ చిత్రం ‘ధర్మన్’ షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. దర్శకుడు అశ్వత్ మారిముత్తు ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. తాజాగా ఈ సినిమా మూడో షెడ్యూల్ బుధవారం ప్రారంభమైంది. ఈ విషయాన్ని దర్శకుడు అశ్వత్ తన ఎక్స్ ఖాతా ద్వారా అధికారికంగా ప్రకటించారు. షూటింగ్ సెట్స్ నుంచి ఒక ఆసక్తికరమైన బిహైండ్-ది-సీన్స్ (బీటీఎస్) వీడియో క్లిప్‌ను ఆయన పంచుకున్నారు. ఈ వీడియోలో సూపర్ స్టార్ రజనీకాంత్, నటి రాశి ఖన్నాతో ముచ్చటిస్తూ కనిపించారు. “ధర్మన్ మూడో షెడ్యూల్ కోసం మళ్లీ తలైవర్‌తో కలిశాను” అంటూ ఈ పోస్ట్‌కు క్యాప్షన్ జోడించారు. ఈ క్లిప్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఇటీవలే సెప్టెంబర్ 4న ఈ చిత్ర రెండో షెడ్యూల్‌ను విజయవంతంగా పూర్తి చేసుకున్న సంగతి తెలిసిందే. ఆ సమయంలో చిత్ర నిర్మాణ సంస్థ రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్.. రజనీకాంత్ ఒక సీనియర్ మెడికల్ ఫ్యాకల్టీగా జూనియర్ డాక్టర్లకు పాఠాలు చెబుతున్న సన్నివేశాలతో కూడిన వీడియోను విడుదల చేసింది. ఈ లుక్‌కు అభిమానుల నుంచి అద్భుతమైన స్పందన లభించింది. ఈ చిత్రాన్ని లోకనాయకుడు కమల్ హాసన్ తన సొంత నిర్మాణ సంస్థ రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ పతాకంపై నిర్మిస్తున్నారు. కమల్ నిర్మాణంలో రజనీ నటిస్తుండటంతో ఈ ప్రాజెక్ట్‌పై తమిళంతో పాటు తెలుగు ప్రేక్షకుల్లోనూ భారీ అంచనాలు నెలకొన్నాయి. ‘ధర్మమే వెల్లుమ్’ (ధర్మమే గెలుస్తుంది) అనే ట్యాగ్‌లైన్‌తో కమల్ హాసన్ స్వయంగా ఈ సినిమా టైటిల్‌ను ప్రకటించారు. ఈ చిత్రంలో రజనీకాంత్ ఒక వైద్యుడి పాత్రలో నటిస్తూనే, సమాజంలోని నేరస్థులను శిక్షించే శక్తివంతమైన పాత్రలో కనిపించనున్నారని ప్రచారం జరుగుతోంది. గతంలో విడుదలైన టైటిల్ పోస్టర్‌లో ఆపరేషన్ థియేటర్‌లో స్కాల్‌పెల్ చేతిలో పట్టుకుని, ఒక రౌడీ మృతదేహంపై కాలు వేసి ఉన్న రజనీకాంత్ లుక్ సినిమాపై ఉత్కంఠను మరింత పెంచింది. ఈ చిత్రానికి యువ సంచలనం అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తుండగా, నికేత్ బొమ్మి సినిమాటోగ్రాఫర్‌గా పనిచేస్తున్నారు. జాతీయ అవార్డు గ్రహీతలైన అన్బరివ్ ద్వయం స్టంట్స్ కొరియోగ్రఫీ చేస్తున్నారు. కమల్ హాసన్, ఆర్. మహేంద్రన్ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. వరుస షెడ్యూళ్లతో సినిమాను వేగంగా పూర్తి చేసేందుకు చిత్ర యూనిట్ ప్రణాళికలు రచిస్తోంది.

# అనంత్ నాగ్‌కు ప్రతిష్టాత్మక దాదా సాహెబ్ ఫాల్కే పురస్కారం

### ఈ నెల 22న రాష్ట్రపతి చేతుల మీదుగా ప్రధానం



ప్రముఖ కన్నడ నటుడు అనంత్ నాగ్‌ను సినీ రంగంలో అత్యున్నత ప్రతిష్టాత్మక పురస్కారం దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు వరించింది. 2024 సంవత్సరానికి ఆయనకు ఈ అవార్డును కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. భారతీయ సినిమాకు అనంత్ నాగ్ అందించిన సేవలు, విశిష్టమైన సినీ ప్రస్థానానికి గుర్తింపుగా ఈ పురస్కారం అందించినట్లు కేంద్రం తెలిపింది. గుజరాత్‌లోని కేవడియాలో ఈ నెల 22న జరగనున్న 72వ జాతీయ చలన చిత్ర అవార్డుల ప్రధానోత్సవంలో అనంత్ నాగ్‌కు... రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ పురస్కారం అందజేయనున్నారు. కన్నడతో పాటు పలు భాషల్లో దాదాపు 300కు పైగా సినిమాల్లో నటించారు అనంత్ నాగ్. ఆయనకు అత్యున్నత పురస్కారం దక్కడం పట్ల కన్నడ ఇండస్ట్రీతో పాటు సినీ అభిమానులు, పలువురు ప్రముఖులు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.నటుడు అనంత్ నాగ్‌కు ప్రధాని మోదీ అభినందనలు తెలిపారు. ఈ మేరకు సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ‘ప్రతిష్టాత్మక దాదాసాహెబ్ ఫాల్కే పురస్కారంతో సత్కరించబడిన ప్రఖ్యాత నటుడు అనంత్ నాగ్ గారికి అభినందనలు. గత కొన్ని దశాబ్దాలుగా, ఆయన సహజ నటన, అద్భుతమైన బహుముఖ ప్రజ్ఞ, అసాధారణమైన కళా నైపుణ్యం భారతీయ సినిమాపై, ముఖ్యంగా కన్నడ చిత్ర పరిశ్రమపై చెరగని ముద్ర వేశాయి. ఆయన పోషించిన ప్రతి పాత్రలోనూ సాటిలేని నటనను, జీవాన్ని నింపారు. ఒక గొప్ప కళాకారుడికి ఇది నిజంగా దక్కిన అర్హమైన గౌరవం.’ అంటూ పోస్ట్ చేశారు. దాదాపు 5 దశాబ్దాల సినీ ప్రయాణంలో అనంత్ నాగ్... కన్నడతో పాటు తెలుగు, హిందీ, మరాఠీ, మలయాళ, ఇంగ్లీష్ భాషల్లో దాదాపు 300కు పైగా సినిమాల్లో నటించారు. తన నటనతో ఎంతో మంది ప్రేక్షకుల మనసు గెలుచుకున్నారు. థియేటర్ నటుడిగా కెరీర్ ప్రారంభించిన ఆయన... 1973లో కన్నడ మూవీ ‘సంకల్ప’తో ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చారు. ఆ తర్వాత మంథన్, కొందుర, కల్‌యుగ్ తదితర చిత్రాలు ఆయనకు మంచి గుర్తింపు తెచ్చిపెట్టాయి. ఆర్కే నారాయణన్ కథల ఆధారంగా తెరకెక్కించిన ఫేమస్ టీవీ సీరియల్ ‘మాల్గుడి డేస్’లో అనంత్ నాగ్ మిఠాయి వాలా పాత్రతో దేశవ్యాప్తంగా పాపులర్ అయ్యారు. అలాగే, రాజ కుమార, గాలిపట 2, కేజీఎఫ్, కన్నేశ్వర రామ వంటి మూవీస్ మరింత పేరు తీసుకొచ్చాయి. తెలుగులో భీష్మ, బాలు, అనుగ్రహం, శంఖారావం వంటి చిత్రాల్లో నటించారు. భారతీయ సినిమాకు ఆయన చేసిన సేవలకు కేంద్ర ప్రభుత్వం 2025లో ‘పద్మ భూషణ్’తో గౌరవించింది. ఇప్పుడు అత్యున్నత దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు అందించనుంది.

# ఓటీటీలోనూ సత్తా చాటుతోన్న విశ్వనాథ్ అండ్ సన్స్




కోలీవుడ్ స్టార్ హీరో సూర్య, మమితా బైజు జంటగా నటించిన సినిమా ‘విశ్వనాథ్ అండ్ సన్స్’. వెంకీ అట్లూరి దర్శకత్వం వహించిన ఈ ఫ్యామిలీ డ్రామా థియేటర్లలో భారీ విజయం సాధించింది. అనంతరం సెప్టెంబర్ 11న నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ అవుతోంది. ఈ మూవీ థియేటర్ రన్‌లోనే కాదు.. ఓటీటీలోనూ తన సత్తా చాటుతోంది. ఈ క్రమంలో ముఖ్యంగా దళపతి విజయ్, ప్రభాస్ సినిమాల వ్యూస్‌ను అధిగమిస్తూ సూర్య మూవీ సరికొత్త రికార్డు సృష్టించింది. ‘విశ్వనాథ్ అండ్ సన్స్’ తొలి వారంలోనే రికార్డు స్థాయి వ్యూస్ సొంతం చేసుకుంది. నెట్‌ఫ్లిక్స్ వెల్లడించిన గణాంకాల ప్రకారం.. ఈ సినిమా తొలి వారం (సెప్టెంబర్ 7 నుంచి 13 వరకు)లోనే 5.5 మిలియన్ వ్యూస్ సాధించింది. మొత్తం 14.6 మిలియన్ వ్యూయింగ్ అవర్స్ నమోదు చేసింది. ప్రపంచవ్యాప్తంగా నెట్‌ఫ్లిక్స్ నాన్-ఇంగ్లిష్ మూవీస్ ట్రెండింగ్ జాబితాలో మూడో స్థానంలో నిలిచింది. ఈ రికార్డు బట్టి చూస్తే ఈ సినిమాకు ఇండియాలోనే కాకుండా విదేశీ మార్కెట్లలోనూ ప్రేక్షకుల ఆదరణ లభిస్తోంది. నెట్‌ఫ్లిక్స్‌లో ప్రస్తుతం ఈ సినిమా తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, మలయాళం భాషల్లో అందుబాటులో ఉంది. 5.5 మిలియన్ వ్యూస్‌తో ‘విశ్వనాథ్ అండ్ సన్స్’.. 2026లో థియేటర్ల తర్వాత ఓటీటీలోకి వచ్చిన సౌత్ ఇండియన్ సినిమాల ఫస్ట్ వీక్ వ్యూయర్‌షిప్‌లో టాప్ లో నిలిచింది. అంతకుముందు విజయ్ మూవీ బ్లాస్ 4.4 మిలియన్ వ్యూస్‌తో టాప్ ఉండగా.. సూర్య సినిమా ఆ రికార్డును బ్రేక్ చేసింది. కరా 3.8 మిలియన్, జననాయగన్ 3.6 మిలియన్, ప్రభాస్ ‘రాజాసాబ్ 3.4 మిలియన్ వ్యూస్‌తో తదుపరి స్థానాల్లో నిలిచాయి. అంటే సూర్య సినిమా థియేటర్లలో సాధించిన విజయాన్ని ఓటీటీ రిలీజ్ తర్వాత కూడా కొనసాగించిందని చెప్పొచ్చు. ఇదే సమయంలో మరో రికార్డు నమోదైంది. నెట్‌ఫ్లిక్స్‌లో థియేట్రికల్ రిలీజ్ తర్వాత స్ట్రీమింగ్‌కు వచ్చిన సౌత్ ఇండియన్ సినిమాల ఆల్‌టైమ్ ఫస్ట్ వీక్ వ్యూయర్‌షిప్‌లో ‘విశ్వనాథ్ అండ్ సన్స్’ 5.5 మిలియన్ వ్యూస్‌తో రెండో స్థానంలో నిలిచింది. ఈ జాబితాలో అల్లు అర్జున్ పుష్ప 2 5.8 మిలియన్ వ్యూస్‌తో మొదటిస్థానంలో ఉండగా.. ఆ తర్వాత ‘విశ్వనాథ్ అండ్ సన్స్’ 5.5 మిలియన్‌తో నిలిచింది. ఇడ్లీ కాడాయి 5.2 మిలియన్, లక్కీ భాస్కర్ 5.1 మిలియన్, బాస్ట్ 4.4 మిలియన్ వ్యూస్‌తో తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. అంటే కేవలం 2026లోనే కాకుండా నెట్‌ఫ్లిక్స్‌లో సౌత్ సినిమాల డిజిటల్ వ్యూస్‌లో కూడా కూడా సూర్య మూవీ టాప్‌లో నిలిచిందన్నమాట. ఇక సూర్య మూవీకి అంతర్జాతీయంగా కూడా మంచి ఆదరణ లభిస్తోంది. 14 దేశాల్లో నెట్‌ఫ్లిక్స్ టాప్ 10లో ఈ సినిమా ట్రెండింగ్ లో ఉంది. బహ్రెయిన్, శ్రీలంక, భారత్, యూఏఈ వంటి దేశాల్లో టాప్ స్థానంలో నిలిచినట్టు నెట్ ఫిక్స్ తెలిపింది. ఇది సూర్య సినిమాకు ఉన్న మార్కెట్‌ను మరోసారి చూపిస్తోంది. ముఖ్యంగా తెలుగు, తమిళం అనే రెండు ప్రధాన మార్కెట్లతో పాటు ఇతర భాషల్లోనూ విడుదల కావడంతో ఈ సినిమా ఈ రేంజ్‌లో గ్లోబల్ రీచ్ అందుకుందని చెప్పాలి.



Printed, Published by **Mohammed Murthuza.** Printed at NUTAN OFFSET PRINTERS, R.S.NO. 434, PLOT NO 16,17, AUTO NAGAR, VIJAYAWADA, KRISHNA, ANDHRA PRADESH - 520007. Ediotr: **MOHAMMED MURTHUZA,** PRGI No:APTEL/26/A3949, www.samayam.net Mobile No. **7036644111, 9490140565**